


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## నేడు కాకినాడకు లోకేష్

తిమ్మాపురంలో చాగంటి ఆధ్వర్యంలో 'భారతీయం' పేరుతో కార్యక్రమం

- వివరాలు 5 లో..



గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే నేడు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తోంది..వారి ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలోని 28,445 కుటుంబాలకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ శనివారం పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకమని ఉద్ఘాటించారు. కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం. ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం.. ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తామని స్పష్టం చేశారు. విశాఖ కాబోయే విశ్వనగరం.. అభివృద్ధి ఇక ఆగదని స్పష్టం చేశారు.

### పేదల ఆత్మగౌరవానికి

# పట్టాభిషేకం

- ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తున్నాం
- దశాబ్దాల సమస్యకు ముగింపు పలుకుతున్నాం
- గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే.. నేడు కూటమి ప్రభుత్వం పట్టాలు ఇస్తోంది
- కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం
- సొంతిల్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం
- విశ్వనగరంగా విశాఖపట్నం...అభివృద్ధి ఇక ఆగదు
- విశాఖలో పేదలకు పట్టాల పంపిణీలో సీఎం చంద్రబాబు
- రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కులు
- 28,445 మందికి ఇళ్ల పట్టాలతో లబ్ధిదారుల్లో ఆనందం

2



### విశాఖ ఆర్‌కే బీచ్‌లో

## స్వచ్ఛత కార్యక్రమం

- పాల్గొని చెత్త తొలగించిన సీఎం చంద్రబాబు
- పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముఖాముఖి
- వ్యర్థాలు సేకరించే విధానంపై స్కూబా డైవర్లతో ఇంటరాక్షన్
- అదనపు ఆదాయం వస్తోందని వివరించిన మత్స్యకారులు
- ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్ ప్రారంభం

4



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం విశాఖ ఆర్కే బీచ్‌ను సందర్శించారు. సాగర తీర స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. భాగస్వాములుగా ఉన్న మత్స్యకారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్కూబా డైవర్లతో ముచ్చటిం చారు. ప్రత్యేక వలలతో చేపల వేట సమయంలోనే ప్లాస్టిక్ వ్యర్థాల ను సేకరించి ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్‌కు తరలిస్తున్నామని, అదనపు ఆదాయం సమకూరుతుందని మత్స్యకారులు వివరించా రు. అనంతరం పెదజాలరి పేటలో ఏర్పాటు చేయనున్న ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.

### నేడు బెంగళూరుకు

## సీఎం చంద్రబాబు

- 'ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్' కార్యక్రమానికి హాజరు
- రేపటి నుంచి కుప్పంలో రెండురోజుల పర్యటన
- రూ.289.5 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- రూ.38.5 కోట్ల పనులకు శంకుస్థాపనలు

- వివరాలు 3 లో..



## ఎక్కడా పంట నష్టం జరగకూడదు

- అక్టోబరు 1న కరువు మండలాలు ప్రకటించాలి
- సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగుకు అత్యధిక ప్రాధాన్యం
- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ
- వర్షాభావ పరిస్థితులపై సమీక్షలో సీఎం చంద్రబాబు

- వివరాలు 3 లో..

## మంగళగిరిలో మహిళల టీ-20 లీగ్



### ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ప్రారంభించిన నారా బ్రాహ్మణి

### డబ్ల్యూఏపీఎల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మిథాలీరాజ్

మహిళా యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి వారిని భారత మహిళా క్రికెట్ జట్టు వైపు నడిపించడమే లక్ష్యంగా ఏసీఏ ఆధ్వర్యంలో మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) టీ-20 లీగ్ తొలి సీజన్ మంగళగిరిలో ప్రారంభమైంది. ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి ముఖ్యఅతిథిగా హాజరై లీగ్‌ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు.

6







# పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం

విశాఖపట్నం(చైతన్యరథం): దశాబ్దాలుగా ఇళ్లపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలోని 28,445 కుటుంబాలకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టాలు పంపిణీ చేశారు. విశాఖలోని 11 మండలాల్లో 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించడంతోపాటు మొత్తం 19,33, 853 చదరపు గజాల స్థలాన్ని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమంలో కొందరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా పట్టాలు అందజేశారు. రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కు కల్పిస్తూ పట్టాలను పంపిణీ చేశారు. దాంతో పట్టాలు అందుకున్న కుటుంబాల్లో సంతోషం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ పేదలకు పట్టాభిషేకం చేస్తున్నాం. వారి ఇళ్లపై సర్వహక్కులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇన్నాళ్లూ మీ ఇళ్లపై మీకు హక్కు లేదనే బాధ ఉండేది.. దశాబ్దాల ఆందోళనకు ఇవాళ ముగింపు పలుకుతున్నామని చెప్పారు. ఇక మీ ఇళ్లపై వివాదం లేదు..భయం లేదు.. హక్కు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.కన్వేయన్స్ డీడ్స్ ఇస్తున్నాం.. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఈ భూముల విలువ రూ.8,874కోట్లు ఉంటుంది.మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉంటుంది. భూమి విలువ పెరిగిందని అమ్ముకోవద్దు. ఈ భూమే మీకు భరోసా... ధైర్యమని తెలిపారు. 2024ఎన్నికల్లో ప్రజలువేసిన ఓటు వేలాది కుటుం బాలకు కూటమి ప్రభుత్వం ఆస్తి హక్కును కల్పించింది.ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి ఒక్కో ఇటుకా పేరుస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు.. భయం నుంచి భరోసా వైపు.. నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకమని తెలిపారు.

- ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తున్నాం
- దశాబ్దాల సమస్యకు ముగింపు పలుకుతున్నాం
- గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే.. నేడు కూటమి ప్రభుత్వం పట్టాలు ఇస్తోంది
- కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం
- సొంతిల్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం
- విశ్వనగరంగా విశాఖపట్నం... అభివృద్ధి ఇక ఆగదు
- విశాఖలో పేదలకు పట్టాల పంపిణీలో సీఎం చంద్రబాబు
- 28,445 మందికి ఇళ్ల పట్టాలతో లబ్ధిదారుల్లో ఆనందం
- రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కులు



## పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం

కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం.ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం.. ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తాం. రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. వచ్చే మార్చిలోగా మరో 5 లక్షలకు పైగా ఇళ్లు అందిస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కూటమి ప్రభుత్వ విధానం.విశాఖలోని పంచగ్రామాల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. ఇంకా 22వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది.. వారందరికీ త్వరలో పట్టాలు అందించేలా చర్యలు తీసు కుంటాం. మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తున్నాం. వివిధ జిల్లాల్లో ఇప్పటికే 12వేల కుటుంబాలకు భూములను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చామని చెప్పారు.

## కాబోయే విశ్వనగరం విశాఖ...

విశాఖ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటని ఉద్ఘాటించారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగామని చెప్పారు. విశాఖ కాబోయే విశ్వనగరమని, అభివృద్ధి ఫలాల్లో పేదలకూ భాగస్వామ్యం ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విశాఖను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 145లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని తెలిపారు. తిరుమలలో 89.4శాతం పచ్చదనం ఉన్నట్లే విశాఖలోనూ పచ్చదనాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. విశాఖ అభివృద్ధికి అన్నిరకాలుగా కృషిచేస్తున్నామని చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు కేంద్రం సహకరించిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖఅభివృద్ధి ఇక ఆగదనిస్పష్టం చేశారు.

## రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రం

ఎల్‌నినో ప్రభావంతో విశాఖలో తాగునీటి ఇబ్బందులు తలెత్తు తున్నాయని తెలిపారు. విశాఖకు వచ్చిన వెంటనే తాగునీటి పరిస్థితిపై సమీక్షించానని, సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖకు తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చూస్తామని చెప్పారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలు తీసుకొచ్చామని, వాటిని వంశధారకు అనుసంధానించే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి మార్కాపురానికి నీరందిస్తున్నామని తెలిపారు.



## విధ్వంసం నుంచి వికాసం వైపు

గత ప్రభుత్వ హయాంలో విశాఖలో భూ వివాదాలు, కూల్చి వేతలు, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శిం చారు. గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే.. నేడు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. రుషికొండలో నిర్మించిన భవనాల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుని ప్రజలకు ప్రయోజనం కలిగేలా చేస్తామని తెలి పారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తీసు కొస్తుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని, డేటా సెంటర్ల విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖ ప్రజలకు తాగు నీరు, పరిశ్రమ లకు అవసరమైన నీరు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, అచ్చెన్నాయుడు, బాలవీరాంజనేయ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# అక్టోబరు 1న కరువు మండలాలు ప్రకటించాలి

- పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగుకు అత్యధిక ప్రాధాన్యం
- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ
- వర్షాభావ పరిస్థితులపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబరు 1న కరువుమండలాలను ప్రకటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కరువు మండలాలను గుర్తించడంతోపాటు ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్రానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావం, వ్యవసాయ- -ఉద్యాన పంటల పరిస్థితి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, తాగునీటి సరఫరాపై క్యాంపు ఆఫసు లో శనివారం సమీక్ష నిర్వహించారు. కరువు మండలాల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఆరు శాఖల నుంచి అందే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, శాటిలైట్ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### 513 మండలాల్లో కరువు ఛాయలు

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరువు నెలకొందని అధికారులు తెలిపారు. వీటిలో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగాను, 245 మండలాల్లో మోస్తరుగా ఉందన్నారు. కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో క్షేత్ర స్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలిస్తాయని, అనంతరం వ్యవసాయశాఖ క్షేత్ర పరిశీలన నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తుందని చెప్పారు. కరువు ప్రతిపాదనలను రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖకు జిల్లా కలెక్టర్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి సెప్టెంబరు 24 చివరి తేదీగా నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను సెప్టెంబరు 29న రాష్ట్రస్థాయి కమిటీ సమావేశంలో పరిశీలిస్తారని తెలిపారు.

### ఉద్యాన పంటలపై ఎల్‌నినో ప్రభావం

ఉద్యాన పంటలు కాడటానికి ఇప్పటికే రూ.190 కోట్లు కేటా యించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులతోపాటు ఎల్‌నినో ప్రభావాన్ని కూడా అధికారులు వివరించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 ఆర్ఎస్‌కేల పరిధిలో ఉన్న పంటలు హై రిస్క్ కేటగిరీలో ఉన్నా యన్నారు.

ఎల్‌నినోతో 17,916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) కింద రైతులకు సంబంధించిన నాలుగు కీలక సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ కింద అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చూడాలని సీఎం నిర్దేశించారు.

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బందిపడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటికి బోర్లపైన ఆధారపడే ప్రాంతాలకు అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా చూడాలన్నారు. విశాఖ తాగు నీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టా లన్నారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి విశాఖ తాగునీటి సరఫరా సంబంధిత పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లు నింపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలన్నారు. మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ నుంచి ప్యాకేజీ నెం.8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలన్నారు. విశాఖ నగరానికి మరో 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

## నేడు బెంగళూరుకు సీఎం చంద్రబాబు

**'ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్' కార్యక్రమానికి హాజరు**

**రేపటి నుంచి కుప్పంలో రెండురోజుల పర్యటన**

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం బెంగళూరులో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బెంగళూరులోని 'ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని రాత్రికి బెంగళూరులోనే బస చేస్తారు. సెప్టెంబరు 21, 22 తేదీల్లో రెండురోజులపాటు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. 21న సోమవారం ఉదయం బెంగళూరు నుంచి చిత్తూరు జిల్లా శాంతి పురం మండలం తుమ్మి గ్రామానికి చేరుకుని గుండిశెట్టి పల్లి వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ దగ్గర జలహారతిలో పాల్గొంటారు. కుప్పంలో రూ.289.5 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, రూ.38.5 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కుప్పం మున్సిపాలిటీ తంబిగానిపల్లిలో రైతుబజార్‌కు శంకుస్థాపన చేయనున్నారు. కుప్పం కొత్తపేటలో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 21న రాత్రి కుప్పం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొం టారు. ఆ తర్వాత కుప్పం రైల్వేస్టేషన్‌లో దాదర్- పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు సర్వీసును ప్రారంభిస్తారు.

### హెచ్ఏఎం ప్రాజెక్టులకు శ్రీకారం

ట్రైన్ నెంబర్ 11005 దాదర్- పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. సెప్టెంబరు 22న శాంతిపురం మండలంలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ హెచ్ఏఎం ప్రాజెక్టులకు శ్రీకారం చుడతారు. ఈసీ పౌల్ట్రీ షెడ్లను ప్రారంభించనున్నారు.అదేరోజు సాయంత్రం చిత్తూరు జిల్లా తుమ్మి హెలిప్యాడ్ నుంచి బెంగళూరుకు వెళ్లి అక్కడ నుంచి విమానంలో విజయవాడకు చేరుకుంటారు. 6.20 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

## విశాఖలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం




విశాఖలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, కింజరాపు అచ్చెన్నాయు డు, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు ఉన్నారు.









# విశాఖ ఆర్‌కే బీచ్‌లో స్వచ్ఛత కార్యక్రమం

- పాల్గొని చెత్త తొలగించిన సీఎం చంద్రబాబు
- పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముఖాముఖి
- వ్యర్థాలు సేకరించే విధానంపై స్కూబా డైవర్లతో ఇంటరాక్షన్
- అదనపు ఆదాయం వస్తోందని వివరించిన మత్స్యకారులు
- ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్ ప్రారంభం



విశాఖపట్నం(చైతన్యరథం): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం విశాఖ నగరంలోని ఆర్కే బీచ్‌ను సందర్శించారు. అక్కడ నిర్వహిస్తోన్న సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్న మత్స్యకారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్కూబా డైవర్లతో మాట్లాడారు. బీచ్ శుభ్రత, సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, సముద్రగర్భంలోని వ్యర్థాల తొలగింపు తదితర కార్యక్రమాలను పరిశీలించి వాటిలో భాగ స్వాములైన వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బీచ్ శుభ్రతలో పాల్గొని తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేపడుతున్న విధానాలను పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో మాట్లాడి చేపల వేటతోపాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. ప్రత్యేక వలల తో చేపల వేట సమయంలోనే ప్లాస్టిక్ వ్యర్థాలను సేక రించి ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్‌కు తరలిస్తున్నామని మత్స్యకారులు సీఎంకు వివరించారు. సేకరించి న వ్యర్థాలను డిజిటల్ తూకంపై బరువు కొలుస్తున్నా మని... దాని ఆధారంగా ప్రోత్సాహకం అందుతోం దని.. ఇది తమకు అదనపు ఆదాయమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 1,200 టన్నుల సముద్ర ప్లాస్టిక్‌ను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. అనంతరం సముద్రంలో ప్లాస్టిక్ సేకరించి డిజిటల్ తూకం వేసే విధానాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించి వ్యర్థాలసేకరణ ద్వారా వచ్చే ప్రోత్సాహాన్ని మత్స్యకారులకు అందజేశారు.



### సాగర తీరం.. సముద్ర గర్భంలోనూ స్వచ్ఛత కార్యక్రమాలు


మత్స్యకారులతో మాట్లాడిన అనంతరం సీఎం అక్కడే ఉన్న స్కూబా డైవర్లతో సముద్ర వ్యర్థాలను తొలగించే విధానంపై అడిగి తెలుసుకున్నారు. సముద్ర గర్భంలో రాళ్ల మధ్య, తీరానికి సమీప ప్రాంతాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాడైన చేపల వలలు, సీసాలు, ప్యాకేజింగ్ వ్యర్థాలను తొలగిస్తున్న విధానాన్ని స్కూబా డైవర్లు సీఎంకు వివరించారు. మత్స్యకారుల పడవలతో కలిసి ఉపరితలంతోపాటు సముద్రగర్భంలోనూ వ్యర్థాలను సేకరిస్తున్నామని తెలిపారు. నీటి లోపల నిర్వహిస్తున్న శుభ్రత కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను సీఎంకు చూపించారు. అనంతరం జీవీఎంసీ ఏర్పాటుచేసిన ప్రదర్శన శాలను సీఎం సందర్శించారు. మురుగు కాల్వలు, మ్యాన్ హోళ్ల శుభ్రతకు వినియోగించే సీవరేజ్ రోబోలను పరిశీలించారు. మెషిన్ల సాయంతో పారిశుద్ధ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు ఈ పరికరాలను వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. విశాఖలో సముద్ర, తీర ప్రాంతాల శుభ్రతకు జీవీఎంసీ చేపడుతున్న ఇతర కార్యక్రమాలకు సంబంధించిన వీడియో ప్రజెంటేషన్‌ను సీఎం తిలకించారు. ఈ సందర్భంగా బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రపీస్ ప్రతినిధులు సీఎంను కలిసి సాగర స్వచ్ఛత ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. జీవీఎంసీ ప్రాజెక్టుకు లభించిన గ్లోబల్ గుర్తింపు, ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. పెద జాలరిపేటలో సుమారు 185చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటుచేయనున్న ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు.

### ఒంటరి మహిళకు పెన్షన్ ఇవ్వాలని ఆదేశం

ఇదే సందర్భంలో ఆర్‌కే బీచ్‌లో మురిమిక్చర్ విక్రయిస్తున్న ఓ మహిళను సీఎం పలకరించారు. ఆమె వ్యాపారం, జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. మురిమిక్చర్‌ను రుచి చూసి చూశారు. ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకుని పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.









చైతన్యరథం





# పేదలకు పట్టాభిషేకం

**లబ్ధిదారుల్లో మిన్నంటిన ఆనందం**

**సీఎం చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్**

విశాఖలో పేదలకు పట్టాభిషేకంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం లభించింది. ముందుగా సభా వేదికపైకి సీఎం చేరుకోగానే లబ్ధిదారులు, సభికులు పెద్దఎత్తున హర్షధ్వానాలతో స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఏళ్ల నాటి కలను నిజం చేస్తుండటంతో వారు పట్టరాని సంతోషంలో మునిగితేలారు. అనంతరం వేదికపై మహిళలకు పట్టాలు అందించి సీఎం వారితో ఫొటోలు దిగారు. మొత్తం 28,445 కుటుంబాలకు ఇళ్లపై హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేశారు. విశాఖలోని 11 మండలాల్లో 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించడంతో ఎప్పటినుంచో పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరింది.





## నేడు కాకినాడలో లోకేష్ పర్యటన

**తిమ్మాపురంలో భారతీయం కార్యక్రమం**

అమరావతి(చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ ఆదివారం కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు కాకినాడ రూరల్ నియోజకవర్గం తిమ్మాపురం వద్ద ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలకు చేరుకుంటారు. ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదా రు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 'భారతీయం' పేరుతో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# వైభవంగా గరుడసేవ

- **గోవింద నామ స్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు**
- **భక్తి, జ్ఞాన, వైరాగ్యాలకు గరుడసేవ ప్రతీక**
- **భక్తుల కర్పూరహారతులతో తిరుమలలో ఆధ్యాత్మిక శోభ**

తిరుమల (చైతన్య రథం): కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం రాత్రి గరుడసేవ అత్యంత వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు. గజరాజులు ముందు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు భక్తిభావంతో సాగింది. అడుగడుగునా భక్తులు



కర్పూర హారతులు సమర్పిస్తూ.. స్వామివారిని దర్శించుకున్నారు.

శనివారం ఉదయం మలయప్పస్వామి మోహినీ అవతారంలో సర్వాలంకార భూషితుడై జగన్మోహనాకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై భక్తులకు అభయమిచ్చారు. గజరాజులు ముందుగా నడుస్తుండగా, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి పల్లకీసేవ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

### మోహినీ అవతారం -మాయామోహ విమోచనం

మోహినీ రూపంలో స్వామివారి దర్శనం జగత్తును ఆవరించిన మాయామోహాన్నిఅధిగమించి భగవంతుని శరణు పొందాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అంది స్తుంది. సర్వమూ భగవంతుని లీలావిలాసమేనని, భక్తిమార్గమే మాయామోహాల నుంచి విముక్తికి దారి చూపుతుందని ఈ అలంకారం చాటిచెబుతోంది.

### గరుడ వాహనం -భక్తి, జ్ఞాన, వైరాగ్యానికి ప్రతీక

పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన గరుడ వాహనసేవకు 108 వైష్ణవ దివ్యదేశాల్లో విశిష్ట స్థానం ఉంది. భగవంతుని వాహనమైన గరుడుని దర్శించడం ద్వారా భక్తిలో శరణాగతి, జ్ఞానం, వైరాగ్యం కలగాలని స్వామివారు అనుగ్రహిస్తున్నారనే విశ్వాసం ఉంది. గరుడుని దర్శనం సర్వపాపాలను హరిస్తుందని, భక్తులకు ఆధ్యాత్మిక శుభఫలాలను ప్రసాదిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం



# మంగళగిరిలో మొదలైన మహిళల టీ-20 క్రికెట్ సందడి

- ఏసీఏ క్రికెట్ స్టేడియంలో డబ్ల్యూఏపీఎల్‌ను ప్రారంభించిన నారా బ్రాహ్మణి
- డబ్ల్యూఏపీఎల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మిథాలీ రాజ్
- డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, మిథాలీ రాజ్

మంగళగిరి (చైతన్య రథం): మహిళా యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసి,వారిని ఉమెన్ ప్రీమియర్ లీగ్, భారత మహిళా క్రికెట్ జట్టువైపు నడిపించడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) తల పెట్టిన మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) టీ-20 క్రికెట్ తొలి సీజన్ ప్రారంభమైంది. మంగళగిరి లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శని వారం సాయంత్రం నిర్వహించిన ఉమెన్ ఆంధ్ర ప్రీమి యర్ లీగ్ సీజన్-1 ప్రారంభోత్సవ వేడుకలకు హెరి టేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా స్టేడియం ప్రాంగణానికి చేరుకున్న నారా బ్రాహ్మణికి ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, రాజ్యసభ ఎంపీ, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం డబ్ల్యూఏపీఎల్‌ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌తో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు.





## మహిళా క్రికెటర్లకు ఇదో మంచి అవకాశం

ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్స వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని,తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మహిళా క్రికెటర్లకు ఇదో అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు వీరంతా రోల్ మోడల్స్‌గా నిలుస్తారని చెప్పారు.

ప్రతిభ ఉండి అవకాశం వస్తే మహిళా క్రీడాకారిణులు అద్భుతంగా రాణిస్తారని తెలిపారు. మంగళగిరి వేదికగా యువ మహిళా క్రికెటర్లకు అవకాశం కల్పించిన ఏసీఏ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## ఏసీఏ క్రికెట్ స్టేడియంలో 7 రోజులు 13 మ్యాచ్‌లు

భారత మహిళా క్రికెట్ జట్టు మాజీకెప్టెన్ మిథాలీ రాజ్ డబ్ల్యూఏపీఎల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహ రిస్తున్నారు. ఫ్రాంచైజీ విధానంలో రాష్ట్రంలో తొలి సారిగా జరుగుతున్న డబ్ల్యూఏపీఎల్ టీ-20 క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్, అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ తలపడనున్నాయి. మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్‌స్టేడియంలో 7రోజులపాటు 13మ్యాచ్‌లు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య ప్రారంభ మ్యాచ్ జరిగింది. సాయంత్రం అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య రెండో మ్యాచ్ జరిగింది. డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రాహ్మణికి నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ డి.విష్ణుతేజ, ఏసీఏ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వైఎస్ రంగనాథ్ పాల్గొన్నారు.





# 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

- పెన్షన్ దరఖాస్తుల పరిశీలనలో చేతివాటానికి తావివ్వొద్దు
- అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం..
- నేతన్నలకు ఆర్థిక మేలే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చితే సహించేది లేదు
- చేనేత, జౌళి మంత్రి సవిత హెచ్చరిక
- వసూళ్లకు పాల్పడిన ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్



అమరావతి (చైతన్య రథం): 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేయడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎటువంటి అక్రమాలు, అవినీతికి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందజేసేలా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో నేతన్నల దరఖాస్తుల పరిశీలనలో జరుగుతున్న చేతివాటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న లక్ష్యాన్ని నీరుగార్చుతున్న అధికారులపై కొరడా ఝుళిపించారు. దరఖాస్తుల పరిశీలన పేరుతో పచ్చనోట్లకు కక్కుర్తిపడిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకంపై అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పెన్షన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి... వాటి పరిశీలన గురించి ఆరా తీశారు. నూతన పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16,521 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికీ వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84 వేలకుపైగా చేనేతలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.

## అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తుదారుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తెలిసిందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేతలందరికీ ఆర్థిక మేలు కలుగజేయాలన్నది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం సహా పలు పథకాలను ఇటీవల ప్రారంభించారన్నారు. ఇప్పుడు 50 ఏళ్లు నిండిన చేనేతలకు నూతన పెన్షన్లు అందజేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నీరుగార్చేలా కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతి నేతన్నకూ పెన్షన్ అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఎటువంటి అపోహలకు నేతన్నలు గురికావొద్దని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరంలేదని చేనేతలకు తెలిపారు. అర్హత ఉంటే ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

## ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తుల పరిశీలన సమయంలో చేనేతల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందని మంత్రి సవిత మండిపడ్డారు. తాము ఇచ్చే అనుమతులతోనే పెన్షన్లు వస్తాయంటూ డీవో రమణారెడ్డి, ఏడీవో శీనా నాయక్ నేతన్నల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ఆ ఇద్దరు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను ఆదేశించారు. చేనేతల నుంచి వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. అర్హులను గుర్తించే సర్వేలో రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాల్లో పర్యటించి స్వయంగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులనూ తొలగిస్తూ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక పునరుజ్జీవనమే లక్ష్యం

- విజయవాడలో ఘనంగా మహాకవి బోయి భీమన్న జయంత్యుత్సవాలు
- ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్
- రచయిత భూసురపల్లికి 'బోయి భీమన్న అవార్డు-2026' ప్రదానం
- రూ.2 లక్షల పారితోషికం అందజేసిన మంత్రి దుర్గేష్
- అర్హులైన కళాకారులకు త్వరలో ఐడీ కార్డులు: మంత్రి దుర్గేష్
- రాజమహేంద్రి తెలుగు వర్సిటీకి 'బోయి భీమన్న కళాపీఠం' తరలింపుకు చర్యలు



విజయవాడ (చైతన్య రథం): ఏపీలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన మంత్రివర్యులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమ ప్రారంభంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోయి భీమన్న జీవిత ఛాయాచిత్రమాలికను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. అనంతరం వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి, బోయి భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వేడుకలో భాగంగా గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లును 'బోయి భీమన్న అవార్డు-2026'తో పురస్కరించారు. ఆయనకు జ్ఞాపిక, శాలువాతో పాటు రూ.2,00,000 నగదు పారితోషికం చెక్కును మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "మహాకవి బోయి భీమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన రచనల ద్వారా అమరుడయ్యారు, ప్రాతఃస్మరణీయుడిగా నిలిచారు. ఆయన కవితాధోరణికి, ఉదాత్త భావజాలానికి నిజమైన అర్ధాంగి, సర్వస్వం ఆయన సతీమణి హైమావతి. భీమన్న రచనలు సమాజంలో ఎంతో స్ఫూహను, చైతన్యాన్ని రగిలించాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పూర్తిగా కట్టుబడి ఉంది. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతాం. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతో చర్చించి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న భీమన్న కళాపీఠాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్ర వరంలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తీసుకురావడానికి తగినచర్యలు తీసుకుంటాం. సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్.ఎస్. రావత్‌తో మాట్లాడి అర్హులైన ప్రతికళాకారునికి గుర్తింపు కార్డులు ఇప్పిస్తాం" అన్నారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ పనితీరును శ్రీకృష్ణదేవ రాయల భువనవిజయంలోని అష్టదిగ్గజాలతో పోల్చవచ్చని మంత్రి దుర్గేష్ చమత్కరించారు.

బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి మాట్లాడుతూ.. భీమన్న జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, మంత్రి దుర్గేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్ ప్రసంగ శైలిని, వాగ్ధాటిని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు. రాష్ట్ర నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. బోయి భీమన్న గొప్ప సామాజిక రచయిత అని, సమాజ శ్రేయస్సు కోరిన ఆయన సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు.

అవార్డు గ్రహీత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, బోయి భీమన్నలను త్రిమూర్తులుగా, మహాకవులుగా కీర్తించారు. ఈ ముగ్గురూ పద్మ పురస్కారాలు పొందారని గుర్తుచేశారు. కవితా ప్రపంచాన్ని ఏలిన భీమన్న పేరిట తనకు అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. భీమన్న సతీమణి హైమావతి కృషి వల్లే ఆయనకు ఈ గౌరవం ప్రతీ ఏటా దక్కుతోందని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత అంతటి కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి మంత్రి కందుల దుర్గేష్ అని కొనియాడారు. సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేసి నైతిక, సామాజిక విలువలు పెంచిన బోయి భీమన్న కళాపీఠాన్ని ఏపీకి తీసుకువచ్చి, ఆయన సాహిత్యాన్ని పుస్తక రూపంలో ముద్రించాలని కోరారు. సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ సాంస్కృతిక పునరుజ్జీవనం వచ్చిందంటే అది మంత్రి దుర్గేష్ చొరవే అని కొనియాడారు. భీమన్న రాసిన 'పాలేరు', 'గూడు కాలిపోతుంది' వంటి రచనలు దళితుల జీవితాల్లో వెలుగులు నింపి చైతన్యపరిచాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు పూల త్రివిక్రమరావు, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, వారి కుటుంబ సభ్యులు, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, అధికారులు సుమన్, శ్రీనివాస్, పలువురు ప్రముఖ రచయితలు, కవులు మరియు కళాకారులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖ దాహంతీర్చే 'జల' ప్రణాళిక!

- సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తక్షణ, దీర్ఘకాలిక చర్యలు
- ఏలేరునుంచి కణితికి 300 క్యూసెక్కులు.. 350కు పెంచే యోచన
- రైవాడ, మేఘాద్రిగెడ్డకు ప్రత్యామ్నాయ జలాలపై దృష్టి
- పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసే ప్రతిపాదనలు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

విశాఖపట్నం (చైతన్య రథం): సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నం నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత రాకుండా ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించింది. విశాఖ భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖ తాగునీటి అవసరాలపై సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఇరిగేషన్, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినట్టు మంత్రి తెలిపారు. ప్రస్తుత నీటి వనరుల లభ్యత, నిల్వలు, పరిమితులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పైప్‌లైన్లు, లిఫ్ట్‌ల ద్వారా నీటిని అందించే అవకాశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

### ఏలేరు-కణితి ద్వారా తాగునీటికి భరోసా

కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఏలేరు నుంచి ప్రస్తుతం రోజుకు 300 క్యూసెక్కుల నీరు అందుతోంది. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లోనూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయగలుగుతున్నామని మంత్రి తెలిపారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 10.2 టీఎంసీల నీరు ఉండగా, అందులో 6.1 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉందన్నారు. 2027 జూన్ వరకు విశాఖకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని ప్రణాళికాబద్ధంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏలేరు నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటిని 300నుంచి 350 క్యూసెక్కులకు పెంచే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్టు మంత్రి చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలేరు డెడ్ స్టోరేజీలోని నీటిని కూడా వినియోగించుకునేలా మోటార్లు, పంపులను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

### రైవాడకు ప్రత్యామ్నాయ నీటి వనరులు

విశాఖకు మరో ప్రధాన నీటి వనరైన రైవాడ రిజర్వాయర్ సామర్థ్యం 3.6 టీఎంసీ కాగా, ప్రస్తుతం కేవలం 0.9 టీఎంసీ నీరు మాత్రమే ఉంది. రైవాడ కింద ఉన్న సుమారు 5,000 ఎకరాల సాగును సమర్థవంతంగా నిర్వహిస్తూ, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించినట్టు మంత్రి తెలిపారు. రైవాడకు ప్రత్యామ్నాయంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ఎల్ఎంసీ 162వ కిలోమీటర్ వద్ద లేదా అనువైన ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటు చేసి రైవాడకు నీరు అందించే ప్రతిపాదనలను వారం రోజుల్లో పరిశీలించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

### మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కులు

విశాఖకు మరో ముఖ్యమైన నీటి వనరైన మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ సామర్థ్యం 1.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీటిని అందించే పైప్‌లైన్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. మొత్తం 10.5 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 9 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో 1.5కిలోమీటర్ల పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. మిగిలిన పైప్‌లైన్ పనులతో పాటు మోటార్లు, పంపుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మేఘాద్రిగెడ్డకు నీరు అందించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. రైల్వే, ఎలక్ట్రికల్ క్రాసింగ్‌ల వద్ద ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

### తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించాలి

తాటిపూడి రిజర్వాయర్ సామర్థ్యం 3.3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 1.2 నుంచి 1.26 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించడంతో



పాటు విజయనగరం సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించినట్లు చెప్పారు. తక్కువ నీటితో పంటలు సాగు చేసే విధానాలను అవలంబించాలని, సాగునీటి వినియోగాన్ని పర్యవేక్షించాలని విజయనగరం కలెక్టర్‌ను సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

### పురుషోత్తపట్నం లిఫ్ట్‌తో విశాఖకు ప్రయోజనం

విశాఖ తాగునీటి అవసరాల్లో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి అన్నారు. స్థానికవర్షాలపై ఆధారపడే రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరును నింపడం వల్ల ప్రస్తుతం విశాఖకు కీలకమైన నీటి సరఫరా కొనసాగుతోందని తెలిపారు. పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా అప్పట్లో పురుషోత్తపట్నం లిఫ్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం ప్రయోజనం కలుగుతోందన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీటి లభ్యతను సమన్వయం చేసుకునే అవకాశం ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించడంతో శ్రీశైలం నీటిని రాయలసీమ, నాగార్జునసాగర్ తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అదేవిధంగా పురుషోత్తపట్నం ద్వారా ఏలేరును నింపడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లోనూ విశాఖ తాగునీటికి భరోసా ఏర్పడిందన్నారు.

### పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

2027లో పోలవరం పూర్తయిన వెంటనే పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. పోలవరం పూర్తయి ఉంటే ఇప్పటికే ఉత్తరాంధ్రకు గోదావరి జలాల ప్రయోజనం మరింత ముందుగానే అందేదని మంత్రి అన్నారు. పోలవరం పనుల్లో గతంలో జరిగిన జాప్యం వల్ల ఉత్తరాంధ్రకు నీటి ప్రయోజనాలు ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు.

### డేటా సెంటర్ల నీటి అవసరాలపై సమతుల్య ప్రణాళిక

రాబోయే డేటా సెంటర్లకు అవసరమైన నీటి పరిమాణంపై కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని మంత్రి అన్నారు. విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలను సమతుల్యం చేస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై దీర్ఘకాలిక దృష్టి

విశాఖతాగునీరు,పారిశ్రామిక అవసరాలకు శాశ్వత పరిష్కారం కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందని మంత్రి తెలిపారు. గ్రావిటీ ద్వారా విశాఖకు నీటిని అందించే అవకాశాలను పరిశీలిస్తూ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు.

### సెప్టెంబర్ 23న మరోసారి సమీక్ష

సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో ఈ ఏడాది అత్యవసర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విశాఖకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 23న విశాఖ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్, పురపాలక శాఖ అధికారులతో మరోసారి సమావేశమై విశాఖకు శాశ్వత తాగునీటి పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. విశాఖ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# ధనియాల మిల్లుల్లో తనిఖీలు

**కృత్రిమ రంగుల కల్తీపై అనుమానం..**

**రూ.18.2 లక్షల విలువైన ధనియాలు స్వాధీనం**

అమరావతి (చైతన్య రథం): ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలోని ధనియాల ప్రాసెసింగ్ మిల్లుల్లో ఆహార భద్రతా శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ సంచాలకులు అరుణ్‌బాబుతో కలిసి ప్రకాశం జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారులు బి.వేణుగోపాలరావు, శివతేజ ఈ తనిఖీలు చేపట్టారు. తొలుత గణపతి ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీలు చేయగా కృత్రిమ ఆహార రంగులు కనిపించడంతోపాటు, ధనియాల గింజలకు కృత్రిమ రంగులు కలిపి ఉండొచ్చన్న అనుమానం వ్యక్తమైంది. అలాగే అధిక మోతాదులో గంధకం పొగతో శుద్ధి చేసినట్టు కూడా అనుమానం వచ్చింది. దీంతో అధికారులు నమూనాలను సేకరించి, అనుమానిత ధనియాల నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. 210 ప్యాకెట్లు, ఒక్కోటి 40కిలోల చొప్పున మొత్తం 8,400 కిలోల ధనియాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి అంచనా విలువ రూ.10,92,000. అనంతరం సత్యశేష ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ కూడా ధనియాల గింజలకు కృత్రిమ ఆహార రంగులు కలిపి ఉండొచ్చన్న అనుమానంతో ఒక



నమూనాను సేకరించి, అనుమానిత నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. 140 ప్యాకెట్లు, ఒక్కోటి 40 కిలోల చొప్పున మొత్తం 5,600కిలోల ధనియాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి అంచనా విలువ రూ.7,28,000. రెండుమిల్లుల్లో కలిపి 350ప్యాకెట్లలో 14,000 కిలోల ధనియాల నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం అంచనా విలువ రూ.18,20,000. ఇందులో శ్రీ గణపతి ఎంటర్ ప్రైజెస్ నుంచి 8,400 కిలోలు,సత్యశేష ఎంటర్‌ప్రైజెస్ నుంచి 5,600కిలోలు ఉన్నాయి. ఈ మేరకు అధికారులు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు

### ప్రయోగశాలలకు నమూనాలు

తనిఖీల సందర్భంగా సేకరించిన అమలు నమూనాలను గుర్తింపు పొందిన ఆహార పరీక్షా ప్రయోగశాలకు విశ్లేషణ కోసం పంపించారు. ప్రయోగశాల పరీక్షల్లో ధనియాల్లో అనుమతిలేని కృత్రిమ ఆహార రంగులు ఉన్నాయా, గంధకం అవశేషాలు అనుమతించిన పరిమితికి మించి ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించనున్నారు. ప్రయోగశాల నివేదికలు, తనిఖీల్లో లభించిన ఇతర వివరాల ఆధారంగా ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006,దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అనుమతి లేని కృత్రిమరంగులు లేదా అధిక మోతాదులో గంధకం అవశేషాలు ఉన్న ధనియాలు లేదా వాటితో తయారైన పదార్థాలను తీసుకోవడం వల్ల కొంతమందిలో కడుపు సంబంధిత సమస్యలు, అలర్జీ,శ్వాసకోశ ఇబ్బందులువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా సున్నితమైన ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారిలో ప్రభావం ఎక్కువగా ఉండవచ్చు. అయితే వాస్తవ ఆరోగ్య ముప్పు ఏ పదార్థం ఉందో, దాని పరిమాణం ఎంత ఉందో ప్రయోగశాల పరీక్షల్లో తేలిన తర్వాతే నిర్ధారించగలమని అధికారులు స్పష్టం చేశారు.

## బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

**- ఏపీకి భారీ వర్ష సూచన**

విజయవాడ (చైతన్య రథం): ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడి, సోమవారం తూర్పుమధ్య బంగాళా ఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రవాయు గుండంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించారు. బుధవారం ఉదయానికి పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని వివరించారు. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీవర్షాలు, తీరం వెంబడి 40-50కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున, వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు.

చైతన్యరథం

# ప్రతి పాము కాటూ ప్రాణాంతకం కాదు

- అప్రమత్తత.. సత్వర చికిత్సతో తగ్గుతున్న మరణాలు
- 108 అంబులెన్సుల ద్వారా కూడా చికిత్స
- 25 వరకు అంతర్జాతీయ పాముకాటు అవగాహన కార్యక్రమాలు
- గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ (చైతన్య రథం): ప్రతి పాము కాటు ప్రాణాంతకం కాదని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ప్రపంచంలో 3,500 జాతుల పాములున్నాయని, వీటిలో కొన్ని జాతులు మాత్రమే విషపూరితమైనవని తెలిపింది. రాష్ట్రంలో తాచుపాము, రక్తపింజర, కట్లపాము విషపూరితమైనవని పేర్కొంది. ప్రకృతి సమతుల్యతలో పాములు కూడా ఒక భాగమని, ఆత్మరక్షణకు తప్ప మనుషులపై పాములు దాడి చేయవని తెలిపింది.

సరైన జాగ్రత్తలు తీసుకుంటే పాములు పరిసరాలకు రాకుండా నివారించవచ్చని సూచించింది. సెప్టెంబర్ 19 నుంచి 25 వరకు అంతర్జాతీయ పాముకాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం గోడపత్రికను ఆవిష్కరించారు.

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో పాముకాటు విరుగుడు మందు అందుబాటులో ఉందన్నారు. పాముకాటు విరుగుడు మందుతోపాటు వైద్య సేవలను బాధితులకు మరింత చేరువ చేసేందుకు 108 వాహనాల్లోనూ మందును అందుబాటులో ఉంచామన్నారు. ఈ సేవల ద్వారా ఇప్పటివరకు 9 మందికి తక్షణ వైద్య సాయం అందించి ప్రాణాపాయం నుంచి కాపాడామని తెలిపారు.

### గత మూడేళ్లలో కేసుల వివరాలు.. శ్రీకాకుళంలో అత్యధికం

రాష్ట్రంలో గత మూడేళ్లలో పాముకాటు కేసులు దాదాపు 4,500నుంచి 4,800మధ్యనమోదయ్యాయి. 2023లో 4,809, 2024లో 4,573, 2025లో 4,702 కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు 4,111 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కేసులు పెరుగుతూ జూలైలో 890, ఆగస్టులో 1,051 కేసులు నమోదయ్యాయి. 2026జనవరి–ఆగస్టు మధ్య శ్రీకాకుళంలో అత్యధికంగా 706పాముకాటు కేసులు నమోదయ్యాయి. పశ్చిమగోదావరిలో 369, విజయనగరంలో 307, కృష్ణాలో 296, ఏలూరులో 271 కేసులు నమోదయ్యాయి. తీర, గ్రామీణ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండగా, అటవీ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

### తగ్గుతున్న మరణాలు

2024లో 41మంది పాముకాటుకు గురైమరణిస్తే.. 2025లో 13 మరణాలు నమోదయ్యాయి. 2026లో ఇప్పటి వరకూ 6 మరణాలు నమోదయ్యాయి.

### అందుబాటులో విరుగుడు మందు

పాముకాటుకు ఉపయోగించే విరుగుడు మందును అవసరమైన వైద్యకేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. సెప్టెంబర్ 18 నాటికి జిల్లాలవారీగా మొత్తం 2,807 మోతాదులు నిల్వ ఉన్నాయి. విజయనగరంలో 1,391, నెల్లూరులో 364, కృష్ణాలో 267, పశ్చిమ గోదావరిలో 260, కర్నూలులో 213 మోతాదులు ఉన్నాయి.

### 108లో అత్యవసర సేవలు.. 9 మందికి విరుగుడు మందు

పాముకాటు బాధితులకు ఆసుపత్రికి చేరుకునే లోపే అవసరమైన అత్యవసర వైద్యం అందించేందుకు 2026 జనవరి నుంచి 108 అంబులెన్సుల్లో పాము కాటు విరుగుడు మందు అందుబాటులో ఉంచారు. బాధితుడి పరిస్థితిని పరిశీలించి, నిర్దేశిత అత్యవసర వైద్య విధానాల ప్రకారం అవసరమైన వారికి అత్యవసర వైద్య సిబ్బంది మందును అందిస్తున్నారు. ఇప్పటివరకు 9 కేసుల్లో 108 సిబ్బంది విరుగుడు మందు అందించారు.

### తీవ్ర విషప్రభావం.. అంబులెన్సులోనే సత్వర స్పందన

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుడుబాయి తండాకు చెందిన 45 ఏళ్ల చెన్నిబాయి జూలై 18న మొక్కజొన్న పొలంలో కలుపు తీస్తుండగా పాము కాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆమెను హుస్సేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, అక్కడ విరుగుడు మందు అందుబాటులో లేకపోవడంతో కర్నూలుకు తరలించాలని సూచించారు.

108లో తరలించే సమయంలో అత్యవసర వైద్య సిబ్బంది ఆమెను పరీక్షించగా కాటు వేసిన చోట తీవ్రమైన వాపు, మగత, చూపు మసకబారడం, స్వల్పంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంలో ఆక్సిజన్ స్థాయి 93 శాతంగా ఉన్నట్లు గుర్తించారు. విషప్రభావం శరీరమంతా వ్యాపించే సూచనలు ఉండటంతో విరుగుడు మందు, అవసరమైన శ్వాస సహాయం, అత్యవసర చికిత్స అందుబాటులో ఉన్న ఉన్నత వైద్య కేంద్రానికి వెంటనే తరలించారు.

### నిద్రిస్తున్న సమయంలో పాముకాటు.. వెంటనే 108కు సమాచారం

బాపట్ల జిల్లా చీరాల మండలం బర్లవారిపాలెం గ్రామానికి చెందిన 40 ఏళ్ల వెంకయ్య నిద్రిస్తున్న సమయంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో పాముకాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. అత్యవసర వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా ఎడమ కాలికి చీలమండ పైభాగంలో కాటు గుర్తించారు. ఆ సమయంలో ఆయన స్పృహలోనే ఉన్నారు. రక్తపోటు 110/80, గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 80, శ్వాస వేగం 16, రక్తంలో ఆక్సిజన్ స్థాయి 98 శాతంగా ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితిని అంచనా వేసి తదుపరి వైద్యం కోసం తగిన వైద్య కేంద్రానికి తరలించారు. ఈ ఇద్దరు బాధితుల ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం తరువాత తెలుసుకోగా ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

### ఈ జాగ్రత్తలు పాటిస్తే..

పాము కాటుకు గురైన బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, కాటుకు గురైన అవయవాన్ని కదలకుండా ఉంచాలి. ఉంగరాలు, గాజులు, కడియాలు వంటి బిగుతైన వస్తువులను తొలగించి, ఆలస్యం చేయకుండా సమీప వైద్య కేంద్రానికి తీసుకెళ్లాలి. గాయాన్ని కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, గట్టిగా తాడుతో కట్టడం, స్వయంగా మందులు లేదా మూలికలు వేయడం చేయకూడదు. రాత్రివేళ బయటకు వెళ్లేటప్పుడు టార్చ్ ఉపయోగించడం, చెప్పులు ధరించడం, నేలపై నిద్రించకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పాముకాటు ప్రమాదాన్ని తగ్గించవచ్చని శాఖ సూచించింది. పాము కనిపిస్తే దాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించకుండా గుర్తింపు పొందిన పాము రక్షకుల సహాయం తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ పేర్కొంది.

# మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం!

- హామీల్లో 80 శాతం అమలు చేశాం
- వైసీపీకి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదు
- రాయలసీమకు నిజమైన ద్రోహులు వైసీపీ, జగన్మోహన్ రెడ్డే
- అవుకు ఎంపీడీవో కార్యాలయంలో మీడియాతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దుయ్యబట్టారు. నేడు అవుకు ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందని, ఇప్పటికే సుమారు 80 శాతం హామీలను అమలు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన, పక్కన పెట్టిన అనేక అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. స్థానికంగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ విమర్శలకు దిగుతున్నారని మంత్రి మండిపడ్డారు. అవుకు మండలం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిపై ప్రభుత్వ రికార్డులను పరిశీలిస్తే ఏ ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్ అండ్ బీ, గ్రామ పంచాయతీ రహదారుల అభివృద్ధి జరుగుతోందని, స్థానికంగా అవుకు మండలంలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లను నిర్మించామని తెలిపారు. అవుకు పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, అవుకు చరిత్రలో ఏ నాయకుడు చేయనంత అభివృద్ధిని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేతల్లో చేసి చూపిందని మంత్రి అన్నారు. అవుకు పట్టణంలో సుమారు రూ.8 కోట్లతో డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపట్టామని, ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో మరో రూ.3 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తమపై పూర్తి విశ్వాసం ఉంచి, అత్యధిక మెజారిటీతో గెలిపించిన అవుకు ప్రాంత ప్రజల రుణం తీర్చుకోవడం మా బాధ్యత అని ఆయన తెలిపారు.

గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ పోస్టు కూడా ఇవ్వని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, నేడు నిరుద్యోగుల పక్షాన నిలిచిన కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే హక్కు ఏమాత్రం లేదని మంత్రి



ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయంటూ తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ నేతలు చౌకబారు విమర్శలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగుల కలలను సాకారం చేస్తూ 16 వేల డీఎస్సీ ఉద్యోగాలు, ఆరు వేలకుపైగా కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టి నిరుద్యోగులకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. నేడు రాష్ట్రానికి లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు తరలివస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. గతంలో కేవలం భూమి పూజలకే పరిమితమైన వైసీపీ నాయకులు నేడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. వైసీపీ, జగన్మోహన్ రెడ్డి రాయలసీమకు నిజమైన ద్రోహులని, వారి వైఫల్యాల వల్లే రాయలసీమ వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పెండింగ్‌లో పడ్డ సాగునీటి ప్రాజెక్టులను నేడు పూర్తి చేసి ప్రజలకు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. అవుకు రిజర్వాయర్ లీకుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. గత ఐదేళ్లలో అవుకు రిజర్వాయర్, ఎస్ఆర్‌బీసీ కాలువల ఆధునీకరణకు, నిర్వహణకు ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో వైసీపీ నేతలు బహిరంగంగా లెక్కలు చూపాలని సవాల్ విసిరారు. ఇటీవల అవుకు రిజర్వాయర్ లీకుల నివారణకు కూటమి ప్రభుత్వం రూ.1 కోటి నిధులు తక్షణమే వెచ్చించిందని, అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసి లీకులను అరికట్టారని వివరించారు. తమది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ఏదైనా సమస్యలుంటే వాటిని ప్రస్తావించి, మీడియా ద్వారా వెలుగులోకి తీసుకురావడం మంచి పరిణామమేనని, అయితే అదే సమయంలో ప్రభుత్వం చేసే మంచి పనులను, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీడియాపై ఎంతైనా ఉందని ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోరారు.

# విజన్-2047కు కొత్త వనరుల సమీకరణ

- కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రుల భేటీలో కీలక చర్చలు
- వ్యవసాయం, ఎనర్జీ రంగాలపై ప్రత్యేక దృష్టి
- త్వరలో మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్
- ఏపీ భవన్ మీడియా సమావేశంలో మంత్రి పయ్యావుల

న్యూఢిల్లీ (చైతన్య రథం): 'విజన్ 2047' లక్ష్యాల సాధనకు దేశంలోనూ, వివిధ రాష్ట్రాలు తమ లక్ష్యాలను ఏ విధంగా నిర్దేశించుకోవాలి, ఆ లక్ష్యాలను చేరుకోవడానికి ఆర్థిక వనరులను ఏరకంగా సమీకరించుకోవాలి అనే అంశాలపై కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులు నిపుణులతో అత్యున్నతస్థాయి బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్ జరిగినట్టు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే సాధారణ నిధులకు భిన్నంగా, భవిష్యత్ అవసరాల కోసం అదనపు వనరులను ఎలా సమకూర్చుకోవాలనే కోణంలో ఈ సదస్సు ఉపయోగపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ఆర్థిక శాఖ నేతృత్వంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు, ప్రైవేట్ రంగ నిపుణులు, ఆర్థిక వేత్తలు, రిటైర్డ్ సీనియర్ బ్యూరోక్రాట్లతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది ఒక గొప్ప శుభపరిణామమని అన్నారు. సమావేశంలో ప్రధానంగా కీలక రంగాలపై దృష్టి పెట్టామని మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉన్న సవాళ్లు, ఆ రంగానికి కావలసిన పెట్టుబడులు, క్రెడిట్ ఫెసిలిటీస్, వాటర్ ఇంటిగ్రేషన్, రైతులకు ఎదురయ్యే క్లైమేట్ మార్పుల రిస్క్‌లను తగ్గించడంవంటి అంశాలపై చర్చించినట్టు చెప్పారు. అలాగే ఎనర్జీ రంగంలో అవకాశాలు, పబ్లిక్-ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యాన్ని పెంచడంపై టాటా గ్రూప్, కోటక్ గ్రూప్ నిపుణులు, మాజీ ప్లానింగ్ కమిషన్ చైర్మన్ల సలహాలను



పరిగణలోకి తీసుకున్నామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో విజయవంతమైన ప్రయోగాలను ఇక్కడ చర్చించామని, ఇది కేంద్రానికి, రాష్ట్రాలకు మరియు సమాజానికి భవిష్యత్తులో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో హార్టికల్చర్ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ మొదటివారంలో మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ప్రారంభోత్సవాన్ని నిర్వహించాలని భావిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా ఆహ్వానించడం జరిగిందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన తేదీలు ఖరారు కానున్నాయని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై స్పందిస్తూ.. ఈసారి ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారతదేశంలో చాలా తీవ్రంగా ఉందని, దీనివల్ల తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముందుగా ఉన్న పంటలను కాపాడుకోవడం, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి మార్గదర్శకాల మేరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

# భక్తుల సౌకర్యమే ముఖ్యం



- గరుడసేవ ఏర్పాట్లు పరిశీలించిన టీటీడీ చైర్మన్
- అన్నప్రసాదం, తాగునీటి ఏర్పాట్లపై ఆరా

తిరుమల (చైతన్య రథం): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా జరిగే గరుడవాహన సేవను పురస్కరించుకుని టీటీడీ చేపట్టిన ఏర్పాట్లను చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం పరిశీలించారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, జేఈవో ఎ శరత్, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు, ఇతర అధికారులతో కలిసి శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను చైర్మన్ పరిశీలించారు. గరుడసేవను దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు కల్పిస్తున్న అన్నప్రసాదం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించి, భక్తులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. టీటీడీ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గరుడవాహన సేవను దర్శించేందుకు తరలివచ్చిన భక్తులతో మాడవీధుల్లోని గ్యాలరీలు నిండిపోవడంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు, సిబ్బంది నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే

# డీఎస్సీపై జగన్ కుట్రలు

- ఏపీపీఎస్సీ కుంభకోణంపై జగన్ వివరణ ఇవ్వాలి
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్



మంగళగిరి (చైతన్య రథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.150 కోట్ల ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల కుంభకోణాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్మోహన్‌రెడ్డి, ఆపార్టీ నేతలు డీఎస్సీ ప్రక్రియపై నిరాధారమైన కథనాలు అల్లుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్య ప్రకాశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన సిట్ విచారణలో ఏపీపీఎస్సీ కుంభకోణానికి సంబంధించి ఆస్తకర విషయాలు బయటపడ్డాయన్నారు. డీఎస్పీ, ఆర్‌డీఓ, డిప్యూటీ కలెక్టర్‌వంటి ఉన్నత పోస్టులను వేలం వేసి రూ.150కోట్లు దోచుకున్నారని, 736 మంది అభ్యర్థుల సమాధాన పత్రాలను పరిశీలిస్తే ఏకంగా 718 ఓఎంఆర్ షీట్లలో తారుమారు, ఓవర్ రైటింగ్ జరిగినట్టు ఫోరెన్సిక్ తనిఖీల్లో తేలిందన్నారు. ప్రభుత్వ స్ట్రాంగ్‌రూమ్‌లో ఉండాల్సిన జవాబు పత్రాలను 84 రోజులపాటు 'హాయిల్యాండ్' అనే ప్రైవేట్ హోటల్‌లో ఉంచి డ్రైవర్లు, ఇంటి పనివారు, ఎలక్ట్రీషియన్లతో మూల్యాంకనం చేశారని ఆరోపించారు. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమ నియామకులను నాన్-ఫోకల్ పోస్టులు చేయాలని హైకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. మరోవైపు కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామక ప్రక్రియను మంత్రి నారా లోకేష్ పూర్తి పారదర్శకతతో పూర్తి చేశారని స్పష్టం చేశారు. వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలన్నింటికీ ఇప్పటికే ఆధారాలతో సహా సమాధానం ఇచ్చామని, కోర్టులు కూడా ఈ ప్రక్రియ పారదర్శకతను ధృవీకరించాయన్నారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ కోటా కింద ఒక్క పోస్టు కూడా కేటాయించలేదని, స్పోర్ట్స్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఆడియో క్లిప్ రాగానే 'శాప్' అధికారులు పోలీసు ఫిర్యాదు నమోదు చేశారని వివరించారు. అలాగే జాతీయ పతక విజేత దుర్గయ్య నిబంధనల ప్రకారం అవసరమైన వెరిఫికేషన్ సర్టిఫికేట్లు సమర్పించనందునే నియామకం నిలిచిపోయిందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుని ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయిన వైసీపీ, ఇప్పటికైనా డైవర్షన్ నాటకాలు స్వస్తి పలికి కోర్టు పర్యవేక్షణలో బయటపడిన గ్రూప్-1 కుంభకోణంపై జగన్మోహన్ రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# టీడీపీ కార్యాలయంలో గణపతి లడ్డూకి వేలంపాట

## రూ.43,500కు దక్కించుకున్న గుంటూరు నేత చైతన్య

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఐదు రోజులు విశేష పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యాలయ సిబ్బంది భక్తి శ్రద్ధలతో కొలిచారు. శుక్రవారం మధ్యాహ్నం శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అంతకు ముందు వినాయక ప్రసాదానికి వేలంపాట



జరపగా పలువురు నాయకులు, సిబ్బంది పోటీపడ్డారు. గుంటూరుకు చెందిన టీడీపీ నేత మాదల చైతన్య రూ.43,500కు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ దారపునేని నరేంద్రబాబు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబరు ఏవీ రమణ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీఐ పేరుతో వేధింపులు వద్దు

- 102 అప్పీళ్లపై సమాచార కమిషన్ చరిత్రాత్మక తీర్పు
- అనంతపురం వ్యక్తి ఆర్టీఐ దురుపయోగంపై కీలక ఆదేశాలు




అమరావతి (చైతన్య రథం): ఎలాంటి సామాజిక ప్రయోజనం లేకుండా, పూర్తిగా వ్యక్తిగత అవసరాల కోసం సమాచార హక్కు చట్టాన్ని అడ్డం పెట్టుకుని వివిధ శాఖల అధికారులపై వందలాది అప్పీళ్లు దాఖలు చేసిన అనంతపురం జిల్లా కుందుర్పి మండలం కదరంపల్లికి చెందిన బి గోపాల్ వేసిన 102 అప్పీళ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషన్ కొట్టివేసింది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వజ్జ శ్రీనివాసరావు, రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదెన్నలతో కూడిన కమిషన్ ఈ కేసులను బ్యాచ్‌గా విచారించి ల్యాండ్‌మార్క్ తీర్పు వెలువరించింది. భవిష్యత్తులో గోపాల్ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వేసే ఆర్టీఐ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవద్దని అధికారులకు కమిషన్ సూచించింది.

సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 6(1) కింద గోపాల్ వివిధపౌరసమాచార అధికారులకు అనేక దరఖాస్తులు సమర్పించి, తర్వాత మొదటి అప్పీళ్ళు, రెండో అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ కేసులను ఆగస్టు 20, సెప్టెంబరు 9, సెప్టెంబరు 15తేదీల్లో విచారణకు తీసుకోగా, అప్పీలుదారు ఒక్కసారి కూడా హాజరు కాలేదు. అధికారులు మాత్రం హాజరై తమ వాదనలు వినిపించారు. అప్పీలుదారు స్వయంగా సమర్పించిన అఫిడవిట్‌లోనే తాను దాఖలు చేసిన రెండో అప్పీళ్ల సంఖ్య వేలల్లో ఉన్నట్లు పేర్కొన్న విషయాన్ని కమిషన్ గుర్తించింది. సెప్టెంబరు 15న జరిగిన విచారణలో కుందుర్పి డిప్యూటీ తహసీల్దార్, 2002నుంచి ఇప్పటి వరకు గోపాల్ దాఖలుచేసిన 300కుపైగా ఆర్టీఐ దరఖాస్తుల పూర్తి సెట్‌ను కమిషన్ ముందు ఉంచారు.

గతంలో సమాధానం అందిన అంశాలపైనే గోపాల్ మళ్లీ మళ్లీ దరఖాస్తులు వేసి, వరుసగా అప్పీళ్లు కొనసాగిస్తున్నట్టు కమిషన్ గమనించింది. ఇప్పటివరకు పొందిన సమాచారంతో ప్రజా ప్రయోజనం కోసం ఏ ప్రజాహిత వ్యాజ్యం (పిల్) కూడా దాఖలు చేయలేదని అధికారులు తెలిపారు. రైతుల వ్యక్తిగత వివరాలు, ఆస్తులకు సంబంధించిన సమాచారం కోరుతూ దరఖాస్తులు వేసి, ఆ తర్వాత రైతులనుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయని కమిషన్ నమోదు చేసింది. పలు దరఖాస్తుల్లో రోజువారీ పత్రికల్లో వచ్చిన వార్తలపై 'యాక్షన్ టేకెన్ రిపోర్టులు' కోరడం, మూడో వ్యక్తుల ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం అడగడం వంటివి కూడా జరిగాయని గుర్తించింది. తాను ఒక ఆర్టీఐ కమిటీకి మాజీ అధ్యక్షుడినని గోపాల్ తన దరఖాస్తుల్లో పేర్కొన్నా, సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరే హక్కు ప్రతి పౌరుడికి వ్యక్తిగతంగా కల్పించిందేనని, ఏ హోదా పేర్కొన్నా దరఖాస్తుకు ప్రత్యేక ప్రాధాన్యత లభించదని కమిషన్ స్పష్టం చేసింది.

### చట్టం పరిధిపై కమిషన్ వివరణ

ఒక వ్యక్తి వందలాది ప్రశ్నలతో ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేస్తే వాటన్నింటికీ పౌర సమాచార అధికారి సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుందా? అన్నది కమిషన్ ప్రధానంగా పరిశీలించింది. ప్రజా అధికార సంస్థ వద్ద ఇప్పటికే ఉన్నసమాచారాన్ని పొందే హక్కును మాత్రమే చట్టం కల్పిస్తుందని, కొత్త సమాచారం సృష్టించడం, రికార్డుల నుంచి విస్తృతంగా సేకరించి విశ్లేషణ చేయడం, ఊహాత్మక లేదా అపరిమిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం వంటి బాధ్యత ఆర్టీఐ చట్టం కింద ఉండదని కమిషన్ స్పష్టం చేసింది. అయితే దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయన్న కారణంతో ఒక పౌరుడి చట్టబద్ధమైన హక్కు పూర్తిగా రద్దు కాదని కూడా పేర్కొంది. ఈ అంశంపై వివిధ న్యాయస్థానాలు, కేంద్ర సమాచార కమిషన్ ఇచ్చిన తీర్పులను కూడా కమిషన్ పరిశీలించింది.

ఒకే అంశంపై పదేపదే దరఖాస్తులు, అప్పీళ్లు దాఖలు చేయడంవల్ల ప్రజా అధికార సంస్థలతోపాటు సమాచార కమిషన్‌పైనా అదనపు భారంపడుతుందని కమిషన్ పేర్కొంది.ఆర్టీఐ చట్టం పారదర్శకత, జవాబు దారీతనం కోసం ఉద్దేశించినదే అయినా, అంతులేని ఉత్తరప్రత్యుత్తరాలకు, వ్యక్తిగత ప్రయోజనాలకు లేదా అధికారుల సాధారణ విధులకు ఆటంకం కలిగించే విధంగా వాడకూడదని స్పష్టంచేసింది. తనపై, కమిషన్‌పై గోపాల్ చేసిన కుమ్మక్కు ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని,పరిశీలన నాటికి కేవలం 47అప్పీళ్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని కమిషన్ రికార్డులు చూపాయని పేర్కొంది. ఒకవైపు ఎక్కువ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపిస్తూనే, వాటిని వేగంగా విచారణకు తీసుకోవడాన్ని కూడా ప్రశ్నించడం పరస్పర విరుద్ధమని వ్యాఖ్యానించింది. భవిష్యత్తులో కమిషన్‌పై నిరాధార,అవమానకర ఆరోపణలు చేయకుండా సంయమనం పాటించాలని గోపాల్‌ను హెచ్చరించింది.

### డబ్బు డిమాండ్, రేషన్ కార్డుపై విచారణ ఆదేశాలు

ఆర్టీఐ దరఖాస్తుల ద్వారా సేకరించిన వ్యక్తిగత, భూముల వివరాలను ఆధారంగా చేసుకుని సంబంధిత వ్యక్తుల నుంచి గోపాల్ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలను కూడా కమిషన్ పరిగణించింది. డబ్బులు ఇచ్చినట్టు ఆరోపించిన వ్యక్తుల పేర్లు, మొత్తాలు, స్టేట్‌మెంట్లను కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి కమిషన్‌కు సమర్పించారు. ఈ ఆరోపణలు విచారణలో రుజువైతే హక్కు దుర్వినియోగంగా పరిగణించి, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవచ్చని కమిషన్ పేర్కొంది. అలాగే, గోపాల్‌కు భూములు, నివాస గృహం, ద్విచక్ర వాహనం ఉన్నా, డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నా అతనికి వైట్ రేషన్ కార్డు ఎలా జారీ అయిందన్న సందేహాలపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది.

### కమిషన్ తుది పరిశీలన

వేలాది పేజీల పత్రాలను ఉచితంగా ఫోటోకాపీ చేసి అందించడం ప్రభుత్వ యంత్రాంగం సమయాన్ని, ప్రజాధనాన్ని వృథా చేస్తుందని, ఇది చట్టం ఉద్దేశం కాదని కమిషన్ స్పష్టం చేసింది. సమాచార హక్కు ప్రతి పౌరుడికి కల్పించిన ముఖ్యమైన చట్టబద్ధ హక్కే అయినా, దానిని బాధ్యతాయుతంగా, చట్టం నిర్దేశించిన పరిధిలోనే వినియోగించాలని పేర్కొంది. ఇప్పటికే సమాధానం అందిన అంశంపై మళ్లీ దరఖాస్తు వస్తే, పాత సమాధానాన్ని ప్రస్తావిస్తూ కారణాలతో తిరస్కరించవచ్చని, పునరావృత అప్పీళ్లను కూడా అధికారులు, కమిషన్ తగిన కారణంగా పరిగణించవచ్చని స్పష్టం చేసింది. మొత్తంగా బి గోపాల్ దాఖలు చేసిన 102 బ్యాచ్ కేసులను సమగ్రంగా పరిశీలించిన కమిషన్, పునరా వృత, విస్తృత, ఫిర్యాదు ఆధారిత దరఖాస్తులు, అప్పీళ్ల ద్వారా ప్రజా వనరులను అనవసరంగా వినియోగించే ధోరణిని చట్టం ప్రోత్సహించదని తేల్చిచెప్పింది. సమా చార హక్కును ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా విని యోగించాలని, అదే సమయంలో ప్రజా అధికార సంస్థలు కూడా అందుబాటులో ఉన్న సమాచారాన్ని పారదర్శకంగా అందించాలని కమిషన్ తన తీర్పులో స్పష్టం చేసింది.

# కబ్జాలు.. రికార్డుల తారుమారు.. న్యాయం కోసం అర్జీలు

- 7 ఎకరాల వారసత్వ భూమిపై అక్రమ రిజిస్ట్రేషన్లు
- 1945నాటి భూమిపై దేవాదాయ శాఖ ఆంక్షలు
- ప్రభుత్వ దారినీ ఆక్రమించి పొలాలకు వెళ్లకుండా అడ్డంకులు
- ప్రజలనుంచి అర్జీలు స్వీకరించిన గ్రీవెన్స్ మేనేజర్



మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో శనివారం గ్రీవెన్స్ మేనేజర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూ కబ్జాలు, రెవెన్యూ రికార్డుల తారుమారు, వారసత్వ భూములపై ఆంక్షలు, ప్రభుత్వ దారుల ఆక్రమణ తదితర సమస్యలపై పలువురు బాధితులు ఫిర్యాదులు అందజేసి న్యాయంచేయాలనికోరారు. చిత్తూరుజిల్లా పెనుమూరు మండలం శాతంబాకం గ్రామానికి చెందిన వి శ్రీనివాసరావు తన కుటుంబానికి దాదాపు 80 సంవత్సరాలుగా వారసత్వంగా వస్తున్న సుమారు 7 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదు చేశారు. తమవద్ద పట్టాలు, పాస్ పుస్తకాలు, ఈసీ తదితర ఆధారాలు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వహయాంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, నకిలీ దస్తావేజులతో హేమచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, భూమిని నిషేధిత జాబితాలో ఉంచి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారని తెలిపారు. అయితే, క్షేత్రస్థాయి విచారణ జరపకుండా రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం గురప్పగారిపల్లెకు చెందిన పుల్లయ్య.. తన ముత్తాత 1945 ఏప్రిల్ 15న రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన 5.25 ఎకరాల వారసత్వ భూమిపై దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఆంక్షలు విధించారని ఫిర్యాదు చేశారు. తమ తండ్రి ఈ భూమిని బ్యాంకులో తాకట్టు పెట్టి బావి తవ్వించి వ్యవసాయం కొనసాగించారని, అనంతరం రెవెన్యూ అధికారులు తమ తల్లి, తన పేర్లతో చట్టబద్ధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారని తెలిపారు. ప్రస్తుతం కూడా భూమి తమ స్వాధీనంలోనే ఉండి సాగు చేసుకుంటున్నామని, తమ వద్ద 1945నాటి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలు, ఈసీ, పాస్ పుస్తకాలు, ఆర్ఓఆర్ రికార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి విచారణ లేకుండా దేవాదాయ శాఖ అధికారులు బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి నోటీసులు జారీ చేసి రిజిస్ట్రేషన్లు నిలిపివేయించారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

భద్రాచలంకు చెందిన ఉప్పాలపాటి విజయలక్ష్మి కైకలూరు మండలం తమరకొల్లు గ్రామంలో తరతరాలుగా తమ కుటుంబానికి చెందిన 6.88 ఎకరాల వ్యవసాయ భూమికి వెళ్లే ప్రభుత్వ బండ్ల దారిని కొందరు ఆక్రమించారని ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ పోరంబోకు భూమిని డి-ఫారం పట్టాగా పొందిన గంగుల విజయలక్ష్మి, గంగుల ప్రశాంత్ తదితరులు అక్కడ రొయ్యల చెరువులు సాగు చేస్తూ, తమ పొలానికి వెళ్లే ప్రభుత్వ దారిని కూడా ఆక్రమించారని తెలిపింది. తహసీల్దార్, మండల సర్వేయర్ విచారణ జరిపి దారిని వినియోగించుకోవచ్చని చెప్పడంతోపాటు, సమస్య సృష్టించబోమని ప్రత్యర్థుల నుంచి లిఖితపూర్వక హామీతీసుకున్నప్పటికీ మరుసటి రోజు నుంచే మళ్లీ అడ్డంకులు సృష్టించారని ఆరోపించింది. ఒంటరి మహిళనని చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం బొప్పాపురం గ్రామానికి చెందిన ప్రేమమ్మ తన తండ్రికి 1977లో ప్రభుత్వం డి-పట్టా రూపంలో మంజూరు చేసిన 2.18 ఎకరాల భూమితోపాటు, బంధువుల పేర్లపై ఉన్న మరికొంత భూమినిస్థానిక పెత్తందారులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేసింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తమకు అధికారికంగా పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా అందాయని తెలిపింది. సర్వే అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై పాత రికార్డులను పక్కనబెట్టి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పేర్లు మార్చుకున్నారని ఆరోపించింది. తాము దళితులమని రాజకీయ అండదండలతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, భూమి వైపు వెళ్తే అంతుచూస్తామని బెదిరిస్తున్నారని తెలిపింది. జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు అర్జీలు ఇచ్చినా స్థానిక అధికారులు తప్పుడు నివేదికలు పంపుతున్నారని ఆరోపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరింది.

కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మి తనకు చెందిన 75 సెంట్ల భూమిని తన పేరుతో ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని కోరినా అధికారులు తిరస్కరించారని ఫిర్యాదు చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు ఎలాంటి సరైన కారణం చూపకుండా భూమిని తన పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించలేమని చెప్పారని తెలిపింది. అదే సర్వే నంబరులో మరో వ్యక్తి పేరుతో ఉన్న భూమిని మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, దీనిపై ప్రశ్నిస్తే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ఆరోపించింది. తన సమస్యను పరిష్కరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది.

వైఎస్సార్ కడప జిల్లా కాజీపేటకు చెందిన తలిశెట్టి శ్రీనివాసులు గుప్తా తమ కుటుంబానికి చట్టబద్ధంగా ఉన్న భూమిని 2006 ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఫిర్యాదు చేశారు. భూమి కోల్పోయినప్పటి నుంచి ఇప్పటివరకు న్యాయమైన నష్టపరిహారం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. తమకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్లు, రేషన్, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఆర్థిక తోడ్పాటు అందించాలని మరికొందరు విజ్ఞప్తులు సమర్పించారు.

చైతన్యరథం

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

## ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వెల్లడి



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా కురుపాం మండలం ఉదయపురం పంచాయతీ పరిధిలోని ఉదయపురం గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కురుపాం ఎంపీడీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకి స్థానిక నాయకులు, మహిళలు, విద్యార్థులు పుష్పగుచ్ఛాలతో పాటు నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పరిశుభ్రమైన పరిసరాలతోనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు గ్రామ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ అందరితో చేయించారు. అనంతరం గ్రామస్తులతో ఎమ్మెల్యే మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉదయపురం గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేదని, ఇటీవల బస్సు సర్వీసు నిలిచిపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏపీఎస్ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి ఉదయపురం బస్సు సర్వీసును పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులు నృత్యాలతో స్వాగతం పలికారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కె. కొండయ్య, అరసవెల్లి సూర్యనారాయణ దేవస్థానం ట్రస్ట్ సభ్యులు వెంపటాపు భారతి, మాజీ ఎంపీపీ రమణమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్, జి.వి.రావు, విప్లవ కుమార్, మధు, దినేష్, చిరంజీవి, శ్రీను, తిరుపతి, యువరాజ్ తో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



"స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా జమ్ము కోమటి చెరువు దగ్గర నిర్వహించిన "స్వచ్ఛతా హీ సేవా-2026" కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు



# కష్టాల్లో కార్యకర్తలకు టీడీపీ అండ

## బీమా చెక్కు అందజేసిన శాసనసభ్యురాలు విజయలక్ష్మి గజపతి రాజు

విజయనగరం (చైతన్యరథం): ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన విజయనగరం పట్టణం, 4వ డివిజన్ మంగలవీధికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షణ్ముఖేశ్వరరావు కుటుంబాన్ని శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన ప్రమాద బీమా రూ. 5,00,000/-లు వారి బ్యాంకు ఖాతాకు జమ అయిన సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపిన సందేశాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తూ నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ చేసిన ఆలోచన వల్ల ఈరోజు కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబానికి భరోసా కలిగిందని చెప్పారు.

# స్వచ్ఛత మన బాధ్యత, స్వర్ణాంధ్ర మన లక్ష్యం

## విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పిలుపు



ఎచ్చెర్ల (చైతన్యరథం): రణస్థలం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనగర్‌లో మండల అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ లంక శ్యామలరావు, టీడీపీ సీనియర్ నాయకులు చౌదరి నారాయణమూర్తి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోడ్లు, కాలనీలు, గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తను సక్రమంగా నిర్వహించడం, పారిశుద్ధ్యాన్ని పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించగలమని, పరిశుభ్రతను ఒక కార్యక్రమంగా కాకుండా నిత్య జీవన విధానంగా మార్చుకోవాలని ఎంపీ సూచించారు. స్వచ్ఛత మన బాధ్యత, స్వర్ణాంధ్ర మన లక్ష్యం అనే సంకల్పంతో ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



విజయనగరం పట్టణ పరిధిలోని కస్పా పాఠశాల అభివృద్ధి కొరకు పీ4 విధానంలో భాగంగా సుమారు రూ. 1,20,000/- విలువైన 200 టాయిలెట్ ఎయిర్ ప్యూరిఫైయర్లను దాత రఘువీర్ విరాళంగా అందజేశారు. వాటిని శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు సమక్షంలో అందజేశారు. అదేవిధంగా, విద్యార్థుల క్రీడా విద్యా అభివృద్ధి కోసం సుమారు రూ. 2,000/- విలువ చేసే వాలీబాల్స్ పుస్తకాలను కూడా అందజేశారు.

# ఏపీపీఎస్సీ, మద్యం కుంభకోణాలపై జగన్ స్పందించాలి : ఎమ్మెల్సీ బీటీ నాయుడు



కర్నూలు (చైతన్యరథం): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన పాపాల పుట్ట పగిలిందని, మద్యం కుంభకోణంలో తన ప్రమేయం ఉందని వచ్చిన వార్తలపై జగన్ మోహన్ రెడ్డి స్పందించాలని ఎమ్మెల్సీ బీటీ నాయుడు సవాలు విసిరారు. విషపూరిత మద్యం తయారు చేసి 35 లక్షల మంది ప్రాణాలు బలి తీసుకున్నారన్నారు. దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లు మద్యం కుంభకోణంలో వచ్చిన ముడుపులను గొడ్డలి పార్టీ నేతలు స్వాహా చేశారన్నారు. మద్యం రవాణాలో రూ.400 కోట్లు, మద్యం తయారీ కంపెనీల నుంచి ముడుపుల రూపంలో రూ. 3,200 కొల్లగొట్టిన ఆర్థిక ఉగ్రవాదులు గొడ్డలి పార్టీ నేతలు సత్యప్రసాద్ వాగ్మూలంతో రాష్ట్ర ప్రజలకు సత్యం తెలిసిందన్నారు. అవినీతి, అక్రమాలు గొడ్డలి పార్టీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాయి. తండ్రి సంపాదన వారసత్వంగా తీసుకోవడం దేశ సంస్కృతి, కానీ జగన్ మాత్రం ఆస్తి వారసత్వంతో పాటు అవినీతి, అక్రమాలను కూడా వారసత్వంగా తీసుకున్నారన్నారు. జగన్ పాలనలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఉద్యోగాల్లో రూ. 150 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. డీఎస్సీపై పదేపదే గంటల తరబడి మాట్లాడుతున్న జగన్, తన హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ కుంభకోణంపై ఎందుకు మాట్లాడటం లేదు? మౌనం అర్ధాంగీకారమా? క్రెడిట్ చోరీ, డైవర్షన్ పాలిటిక్స్ జగన్ డీఎన్ఏలోనే ఉన్నాయన్నారు. పారదర్శకంగా యువతకు ఉద్యోగాలు కల్పిస్తుంటే ఓర్చుకోలేకపోతున్న జగన్ గత ఐదేళ్ల పాలనలో యువతను నట్టేట ముంచేశారన్నారు. గంజాయికి అలవాటు చేసి యువత భవిష్యత్తును నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల విప్లవం మొదలైందన్నారు. యువత భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసాగా నిలిచిందన్నారు.

జోన్ - 2 (కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు) చైతన్యరథం



# సాగరతీరంలో విజయగణపతి సాక్షాత్కారం

## మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు, పాల్గొన్న బుచ్చి రామ్ ప్రసాద్



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం మంగినపూడి సాగరతీరంలో మంత్రి కొల్లు రవీంద్ర గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయగణపతి మహోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్ అన్నారు. శనివారం మంగినపూడి సాగరతీరంలోని విజయగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. సముద్రతీరంలో ఇంతటి వైభవంగా గణపతి మహోత్సవాలను నిర్వహించడం ద్వారా మచిలీపట్నం ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తూ ఉత్సవాలను విజయవంతం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర కృషి అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తోందని బుచ్చి రామ్ ప్రసాద్ అన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు ఆధ్యాత్మికత, దేవాలయాలు, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మంగినపూడి సాగరతీరాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. చంద్రబాబు నాయకత్వం పవన్ కళ్యాణ్ భాగస్వామ్యం లోకేష్ అభివృద్ధి దృక్పథం ప్రధాని మోదీ కేంద్ర సహకారం రాష్ట్ర ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని బుచ్చి రామ్ ప్రసాద్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయాల అభివృద్ధికి సముచిత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విజయగణపతి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రిపాటి గోపీచంద్, ఎన్ఆర్ఐ జి. శ్రీనివాసచంద్, రామలింగేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు నిమ్మగడ్డ శ్రీధర్, బాలాజీ విద్యాసంస్థల అధినేత కొమ్మరగిరి చంద్రశేఖర్, విజయవాడ బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ బ్రాంచ్ మేనేజర్ గొర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ పంటలపై దృష్టిసారించాలి

## రైతులకు పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపు

పెనమలూరు (చైతన్యరథం) మారుతున్న వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ (పామాయిల్) సాగు వైపు రైతులు దృష్టి సారించాలని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపునిచ్చారు. కంకిపాడు మండలం మద్దూరు గ్రామంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పామాయిల్ మొక్కలు నాటి, అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తుపాన్లు, అధిక వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులకు జరుగుతున్న పంట నష్టాన్ని ఏ ప్రభుత్వం అయినా పూర్తిగా భర్తీ చేయడం సవాలుతో కూడుకున్న విషయమన్నారు, ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని కంకిపాడు,ఉయ్యూరు, పామర్రు వంటి లోతట్టు ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా పంటలు తరచూ దెబ్బతింటున్నాయని తెలిపారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టి వరి సాగు చేసిన తర్వాత చేతికొచ్చే సమయంలో తుపాన్లు, భారీ వర్షాలతో పంట నష్టపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, తరతరాలుగా వస్తున్న మూస పద్ధతికి ప్రత్యామ్నాయంగా వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చే పంటల వైపు రైతులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పామాయిల్ తోటలకు తుఫాన్లు, ఈదురుగాలులను తట్టుకునే సామర్థ్యం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు, వరద నీరు వారం,పది రోజుల పాటు ఉన్నా చెట్లకు పెద్దగా నష్టం వాటిల్లదని,వర్షాలకు చేతికొచ్చిన పంట తడిసిపోయి పాడయ్యే పరిస్థితి కూడా ఉండదని వివరించారు. దేశీయంగా భారీ డిమాండ్ భారతదేశంలో పామాయిల్‌కు భారీగా డిమాండ్ ఉందని దేశ అవసరాల్లో ప్రస్తుతం దేశీయ ఉత్పత్తి వాటా తక్కువగా ఉండటంతో భారీ మొత్తంలో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు,దీంతో పామాయిల్‌కు మార్కెట్ పరంగా మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పామాయిల్ సాగులో మొదటి నాలుగు సంవత్సరాల పాటు అంతర పంటలు సాగు చేసుకుంటూ అదనపు ఆదాయం పొందవచ్చని, ఆ తర్వాత తోట నుంచి క్రమంగా నెలనెలా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. మిల్లర్లు, తేమ శాతం,పంట కోత సమయంలో వాతావరణ పరిస్థితులు వంటి అనేక సమస్యలతో ఇబ్బందులు పడే సంప్రదాయ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ మార్గాన్ని అందించే అవకాశం ఉందన్నారు. మెట్ట భూములు, ముంపునకు గురయ్యే ప్రాంతాలు, తుపాన్ల ప్రభావం ఎక్కువగా ఉండే లోతట్టు ప్రాంతాల పంట నష్టాల నుంచి బయటపడేందుకు పామాయిల్ సాగును ప్రత్యామ్నాయంగా పరిశీలించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.






# రాష్ట్రంలో ఆదర్శంగా వినుకొండ ఉండాలి

## స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చీఫ్ విప్ జీవీ పిలుపు

వినుకొండ (చైతన్యరథం): పట్టణంలోని 30వ వార్డు సంజీవ్ గాంధీ నగర్‌లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, స్థానిక ప్రజలతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంతో పాటు ఆరోగ్యాంధ్రప్రదేశ్, ఆనందాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధించడం కేవలం మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని జీవీ పిలుపునిచ్చారు. "మన ఇల్లు శుభ్రంగా ఉంటే సరిపోదు.. మన వీధి, మన వార్డు, మన పట్టణం కూడా పరిశుభ్రంగా ఉండాలి. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి" అని అన్నారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలకు శాశ్వత పరిష్కారంసంజీవ్ గాంధీ నగర్‌లో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పరిశీలించిన జీవీ.. మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్తను తొలగించిన తర్వాత అదే ప్రాంతంలో మళ్లీ చెత్త పేరుకుపోకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అవగాహన బోర్డులు, వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయం స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని జీవీ అన్నారు. "విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెరిగితే.. అది వారి జీవితాంతం కొనసాగుతుంది. ప్రతి విద్యార్థి తన కుటుంబంలో, తన పరిసరాల్లో పరిశు భ్రతకు రాయబారిగా పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని జీవీ అన్నారు. ప్రతిరోజూ ప్రజల కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని అభినందించారు. మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది చెత్త సేకరణ, తరలింపు, పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు సమష్టిగా భాగస్వాములు కావాలని జీవీ కోరారు. "స్వచ్ఛత ఒకరోజు కార్యక్రమం కాదు.. నిరంతరం కొనసాగాల్సిన ప్రజా ఉద్యమం. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజల సహకారం తోడైతేనే సంపూర్ణ ఫలితాలు సాధ్యమవుతాయి" అని అన్నారు. వినుకొండ పట్టణాన్ని పరిశుభ్రతలో రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని జీవీ ఆకాంక్షించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రస్థాయిలో వినుకొండకు ఉత్తమ గుర్తింపు, అవార్డు వచ్చేలా అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. "స్వచ్ఛమైన పరిసరాలు ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. ఆరోగ్యకరమైన సమాజమే ఆనందాంధ్రప్రదేశ్‌కు పునాది. అందుకే స్వచ్ఛాంధ్రం.. ఆరోగ్యాంధ్రం.. ఆనందాంధ్రమే మన లక్ష్యం" అని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు.




# సీఎం చంద్రబాబు ఆశయసాధనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి

## చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు

చిలకలూరిపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక గొప్ప ఆశయంతో చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని, ప్రజా చైతన్యమే సమాజాన్ని, రాష్ట్రాన్ని శుభ్రపరుస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న చెత్తను తొలగించారు. కుప్పలుగా వేసిన కూరగాయలు, పండ్ల వ్యర్థాలను స్వయంగా తొలగించిన ప్రత్తిపాటి..అనంతరం ప్రజలు, పారిశుధ్య కార్మికులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు చేపట్టే ప్రతి కార్యక్రమంలో, ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి. అభివృద్ధి, సంక్షేమంతో పాటు.. ప్రజా రోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని, దానిలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు చేపట్టే ప్రతి కార్యక్రమం.. ప్రతి ఆలోచనలో ప్రజల ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉంటాయని, దానికి ప్రత్యక్ష నిదర్శనమే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. తమ నివాసాలతో పాటు.. చుట్టూ ఉండే పరిసరాలు, రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజల కనీస బాధ్యతని, దానిపై వారు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1 కోటి సీఎస్సార్ నిధులతో పెనుకొండలో రైతు బజార్ నిర్మాణం

## మంత్రి సవిత వెల్లడి

పెనుకొండ (చైతన్యరథం): పట్టణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెనుకొండ మార్కెట్ సమీపంలో కోటి రూపాయల సీఎస్సార్ నిధులతో నిర్మించనున్న రైతు బజార్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ సాంప్రసాద్ గారితో కలిసి శనివారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేలా, ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి దశలో 48 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నామని, రెండో దశలో మరో 200 స్టాళ్లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.పెనుకొండ పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.అలాగే పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు. ఇళ్ల పట్టాల విషయంలో ఎన్నికలకు ముందే 1,500 మందికి పట్టాలు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. పెనుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..






# 8 గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు వెల్లడి

విజయవాడ రూరల్ (చైతన్యరథం): మండలంలోని గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. శనివారం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబాపురం సహా విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంబాపురం గ్రామంలో నీటిలో టీడీఎస్ స్థాయి అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కృష్ణా నది సమీపంలో ఉన్నప్పటికీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. విజయవాడ గ్రామీణ ప్రాంతంలోని తొమ్మిది గ్రామాలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీనం చేసే అంశం పెండింగ్ లో ఉన్నప్పటికీ, ఎన్నికల ప్రక్రియ కారణంగా ప్రస్తుతం ఆ ప్రక్రియను పూర్తి చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అంబాపురం సహా సమస్య ఎదుర్కొంటున్న ఎనిమిది గ్రామాలకు కృష్ణా జలాలు అందించేందుకు అధికారులు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పైపులైన్‌ను అనుసంధానం చేసి సుమారు రూ.2.05 కోట్ల వ్యయంతో తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. కృష్ణా నది నుంచి నేరుగా పైపులైన్ ఏర్పాటు చేస్తే సుమారు రూ.200 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని, అంత భారీ మొత్తాన్ని ఖర్చు చేయకుండా తక్కువ వ్యయంతో శాశ్వత పరిష్కారం చూపించే మార్గాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. సుమారు 1.55 లక్షల నుంచి 1.80 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తోనూ చర్చిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ముందే సాధ్యమైనంత త్వరగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విజయవాడ రూరల్ మండలానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఇప్పటివరకు సుమారు రూ.3.19 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఇంకా రూ.5, 6 కోట్ల వరకు నిధులు అవసరమని, రానున్న రోజుల్లో దశలవారీగా నిధులు సమకూర్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. క్రికెట్ మైదానం అభివృద్ధి, వాటర్ ట్యాంకు, జన్మభూమి రహదారి తదితర పనులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అంబాపురం 5వ లైన్‌లోని శృతి నివాస అపార్ట్మెంట్‌లో కరెన్స శ్రీ గణేశా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర నిర్మాణం



## ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పిలుపు

విజయవాడ (చైతన్యరథం): 31వ డివిజన్ ముత్యాలంపాడులోని గవర్నమెంట్ ప్రెస్ సెంటర్ వద్ద నిర్వహించిన "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, సమాజ పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇతరులకు కూడా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. "స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.

జోన్-4 (ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం

# అమరావతి గ్రౌండ్స్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

కనిగిరి (చైతన్యరథం): స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో కనిగిరి శాసనసభ్యుడు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన, జనని చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో, శంకర్ ఐ హాస్పిటల్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన చికిత్సలు అందించడంతో పాటు, శస్త్రచికిత్స అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.







# ప్రజా దర్బార్‌లో సమస్యలకు సత్వరపరిష్కారం

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వెల్లడి

గిద్దలూరు (చైతన్యరథం): ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసే కార్యక్రమమే ప్రజా దర్బార్ అని గిద్దలూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రజల నుండి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. ప్రజలు నేరుగా తనను కలుసుకొని తమ సమస్యలను తెలియజేయడానికి ప్రజా దర్బార్ కార్యక్రమం ఉపయోగపడుతుందని, ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలు సమస్యలు అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితులు పాల్గొన్నారు.

# అమరావతి ఉద్యమ యోధుడు ధనేకుల రామారావు

## దేవినేని ఉమ ఘన నివాళి



తుళ్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, అమరావతి జేఏసీ సభ్యులు దనేకుల రామారావు కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. అమరావతి ఉద్యమ సమయంలో 40 రోజుల పాటు జైలు జీవితం గడిపిన రామారావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడులోని ఆయన స్వగృహానికి వెళ్లిన దేవినేని ఉమా, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



నగరి నియోజకవర్గం, వడమాలపేటలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

# స్థానిక ఎన్నికల్లో టీడీపీ పతాకం రెపరెపలాడాలి : ఎమ్మెస్ పిలుపు



మడకశిర (చైతన్యరథం): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, శ్రీ సత్యసాయి జిల్లా స్థానిక ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత, వార్డుల వారీగా పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి పరిస్థితులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని, స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ఎన్నికల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని పిలుపునిచ్చారు.





# చెత్త నిర్వహణపై ప్రజల్లో మెరుగుపడిన అవగాహన

## ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ఒంగోలు (చైతన్యరథం): ఈనెల 30వ తారీఖుతో ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ ఘన చరిత్ర ప్రచారానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ఒంగోలు నగరంలో మెగా సెగ్రిగేషన్ డ్రైవ్ చేపట్టడం జరిగినది. ఒంగోలు నగరంలో కబాడీ పాలెం, గానుగపాలెం,ఆంధ్రకేసరి నగర్, గాంధీ నగర్, కొత్త మామిడి పాలెం డంపింగ్ యార్డ్ వద్ద సెగ్రిగేషన్ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ రాజబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భగా శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలు మున్సిపాలిటి ఏర్పడి నూట యాభై సంవత్సాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గత మూడు నెలల నుండి పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో బాగంగా వివిధ ప్రాంతాలలో సుమారు 150 మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు అందించామన్నారు. 81,000 వేల తడి , పొడి చెత్త వేరు చెసే బ్యాగులు అందించామన్నారు. ఇంకా చాలా మంది కాలువలలో చెత్త వేస్తున్నారు , ఇప్పుడు వేరు చేసే విధంగా అవగాహన పెరిగిందన్నారు, ఈ నెల 27వ తేదిన సుమారు మూడు వేల మందితో ర్యాలీ నిర్వహించడం జరుగుతున్నారు. అలాగే 30వ తేదీన బారీగా ఒంగోలు గిత్తల ప్రదర్శన ఉంటుందన్నారు, ఈ కార్యక్రమాలకు ప్రాముఖులు హాజరు కానున్నారన్నారు అన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, ఏఎమ్‌సీ చైర్మన్ వెంకట్రావు, మాజీ మేయర్ సుజాత, నగర అధ్యక్షులు బండారు మదన్, నగర పాలక సంస్థ కమీషనర్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పెనుకొండలో ప్రజాదర్బార్

## పాల్గొన్న బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను, అలాగే పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రెవెన్యూ, భూ వివాదాలు సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేసిన మంత్రి, అందిన ప్రతి అర్జీని త్వరితగతిన పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు.



# ప్లాస్టిక్ నివారణతో పర్యావరణాన్ని కాపాడుదాం

## కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపు

కదిరి (చైతన్యరథం): "ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగ్‌లు ముద్దు" అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. కదిరి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ఎదురుగా నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగ్‌లు, పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. "మన ఆరోగ్యం.. మన పర్యావరణం.. మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కదిరి పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. స్వచ్ఛమైన కదిరి.. ఆరోగ్యకరమైన కదిరి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.

# ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం

## పాల్గొన్న మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మడకశిర (చైతన్యరథం): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా మడకశిర ఎమ్మెల్యే క్యాంప్ స్వయంగా పాల్గొని నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, ఇతర వ్యక్తిగత, వర్గగత సమస్యలపై అర్జీలు అందాయి. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, తక్షణమే స్పందించి ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమర్రి స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్

# మంత్రి లోకేష్ ఆలోచనతో ఉద్భవించిన మై టీడీపీ యాప్

## కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మై టీడీపీ యాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానం చేస్తూ తెలుగుయువత వారధిగా వ్యవహరించాలని యాప్ ద్వారా ఉత్తమ ప్రతిభ కనబర్చిన రావిపాటి సాయి కృష్ణను కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అభినందించారు. టీడీపీ యాప్ ద్వారా గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయి కృష్ణ చేసిన సేవలను గుర్తిస్తూ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పంపిన పార్టీ గుర్తుతో కూడిన మొమెంటో, ప్రశంశాపత్రాన్ని గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చేతులమీదుగా రావిపాటి సాయి కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ ఆలోచనలో నుండి ఉద్భవించిన మై టీడీపీ యాప్ ద్వారా వచ్చే రియల్ టైం సమాచారం సద్వినియోగం చేసుకొని కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమం మరోపక్క ప్రభుత్వ సేవలకు కచ్చితమైన సమాచారాన్ని సాంకేతికతను అందిపుచ్చుకొని వివిధ సామాజికమాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ తెలుగుయువత ఒక వారధిగా క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. పార్టీకి నాయకులు కార్యకర్తలు చేస్తున్న విశేష సేవలను మై టీడీపీ యాప్లో రికార్డ్ చేయటం ద్వారా నేతల పని తీరు సైతం సాంకేతికత ద్వారా పార్టీ అధిష్టానానికి తెలియజేసిన వారవుతారని దీని వల్ల లీడర్ అనాలసిస్ అధిష్టానం ఎప్పటికప్పుడు బేరీజు వేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. రావిపాటి సాయి కృష్ణ మాట్లాడుతూ యాప్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు పరిచయం చేస్తూ క్యాడర్‌ను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయటమే గాక తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకుగా పనిచేస్తున్న మీలాంటి కార్యకర్తల పాత్ర కీలకం అంటూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అభినందనలు తెలియజేస్తూ ప్రశంసాపత్రం జ్ఞాపికను పంపడం పార్టీ కోసం మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడానికి ప్రోత్సాహం అవుతుందని సాయి కృష్ణ ఆనందం వ్యక్తం చేసారు.

# పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు

## వైసీపీ నేతలకు తాళ్ళ వెంకటేశ్ హెచ్చరిక



విజయవాడ (చైతన్యరథం): వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు ఇవ్వడాన్ని రాజకీయం చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై చేస్తున్న నిరాధార ఆరోపణలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి. తాళ్ళ వెంకటేష్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్, అవినీతి, అక్రమాలకు అంబటి రాంబాబు లాంటి నాయకులే ప్రధాన బాధ్యులని విరుచుకుపడ్డారు. తాము చేసిన తప్పులు, బరితెగింపుల వల్లనే దర్యాప్తు సంస్థల నుంచి నోటీసులు వచ్చాయి తప్ప, ఇందులో ఎవరి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఈడీ లాంటి స్వతంత్ర సంస్థల విచారణను ఎదుర్కొనే దమ్ములేక, ప్రతిరోజూ మీడియా ముందుకు వచ్చి చంద్రబాబు, లోకేష్‌పై బురదజల్లే ప్రయత్నం చేయడం అంబటి రాంబాబు రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టిన దోపిడీదారులకు చట్టం నుండి తప్పించుకునే వెసులుబాటు లేదన్నారు. ఇకపై మీ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి మా పార్టీ నేతల పైకి కుట్రపూరిత ఆరోపణలు చేస్తే తెలుగుదేశం పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. మీ అక్రమాలు, లిక్కర్ స్కామ్ పాపాల బండారం త్వరలోనే పూర్తిగా బట్టబయలవుతుందన్నారు. ఇప్పటికైనా మీ పద్ధతి మార్చుకుని, చట్టపరమైన విచారణను ఎదుర్కొవాలి తప్ప, ఇలాంటి పనికిమాలిన విమర్శలు మానితే మంచిదని హితవు పలికారు. లేకపోతే రాష్ట్ర ప్రజల తరపున తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు.

# మేరీల్యాండ్‌లో విద్యార్థులకు 'తానా' చేయూత

## బ్యాక్‌ప్యాక్‌లు, విద్యా సామగ్రి పంపిణీ

**మేరీల్యాండ్:** అమెరికాలోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. తాజాగా 'గివింగ్ బ్యాక్ టు ది కమ్యూనిటీ'లో భాగంగా మేరీల్యాండ్‌లో అవసరమైన విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, విద్యా సామగ్రిని అందించే బ్యాక్‌ప్యాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు, క్రేయాన్స్, ఎరేజర్లు అందించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి మద్దతు తెలిపిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలికి తానా క్యాపిటల్ టీమ్ ధన్యవాదాలు తెలియజేసింది. తానా ప్రతినిధులు, స్థానిక వాలంటీర్లు విద్యార్థులకు బ్యాక్‌ప్యాక్‌లు, అవసరమైన పాఠశాల సామగ్రి అందించారు. చిన్నారుల చదువుకు అవసరమైన వస్తువులను అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు విద్యార్థుల కుటుంబాలపై పడే పాఠశాల సామగ్రి కొనుగోలు భారాన్ని కొంత తగ్గించడమే లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు.

తానా అమెరికాలో నిర్వహిస్తున్న సేవల్లో విద్య, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోంది. స్కాలర్‌షిప్‌లు, విద్యా సహాయం, బ్యాక్‌ప్యాక్‌ల పంపిణీ వంటి వాటి ద్వారా అవసరంలో ఉన్న విద్యార్థులకు అండగా నిలుస్తోంది. తానా సేవా కార్యక్రమాల్లో స్థానిక వాలంటీర్లు, యువత కూడా భాగస్వాములు అవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి తమ వంతు సహాయం, విరాళాలు, ప్రోత్సాహం అందించిన తానా బోర్డు డైరెక్టర్ అనిల్ ఉప్పలపాటి, తానా కమ్యూనిటీ సర్వీసెస్ కో-ఆర్డినేటర్ సాయి బొల్లినేని, తానా బాల్టిమోర్ సిటీ కో-ఆర్డినేటర్ ఉమాకాంత్‌లతో పాటు విజయవంతం చేసిన అందరికీ తానా రీజినల్ రిప్రజెంటేటివ్ సుధీర్ కొమ్మి ధన్యవాదాలు చెప్పారు.














### శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో 26న

# సంగీత, నృత్య వినోద వేడుక

**టెక్సాస్:** శంకర నేత్రాలయ యూఎస్ఏ సంస్థ ఆధ్వర్యంలో అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ నగరంలో 'మ్యూజిక్ అండ్ డాన్స్ ఎంటర్‌టైన్‌మెంట్' నిర్వహించనున్నారు. శంకర నేత్రాలయ ఫౌండర్, 'పద్మభూషణ్' అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్ఎస్ బద్రీనాథ్, ప్రెసిడెంట్ ఎమెరిటస్ ఎస్వీ ఆచార్య మార్గదర్శకత్వంలో ఈ సేవా కార్యక్రమం జరగనుంది.

**తేదీ, సమయం:** సెప్టెంబరు 26 సాయంత్రం ఐదు గంటలకు (CST) వేడుక ప్రారంభమవుతుంది.




**వేదిక:** టెక్సాస్‌లోని రౌండ్ రాక్, గ్రేట్ ఓక్స్ డ్రైవ్‌లో ఉన్న 'సెంట్ ఫిలిప్స్ యునైటెడ్ మెథడిస్ట్ చర్చి' (St.Philipµs United Methodist Church).

ప్రముఖ గాయకులు రాము, అంజనా సౌమ్య మధురమైన పాటలతో ప్రేక్షకులను అలరించనున్నారు.

**ఆస్టిన్ టీమ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ:** ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో శంకర నేత్రాలయ యూఎస్ఏ ఆస్టిన్ చాప్టర్ టీమ్, బోర్డ్ ఆఫ్ ట్రైనీస్ సభ్యులు డాక్టర్ జగన్నాథ్ వేదుల, కరుణ్ రెడ్డి, మల్లికార్జున రావు చింతకుంట, జగదీశ్ తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. బోర్డ్ ఆఫ్ ట్రైనీస్ సభ్యులు డాక్టర్ రెడ్డి ఉరిమిండి, బుచ్చిరెడ్డి గోలి, నారాయణ్ రెడ్డి ఇందూరి, చినసత్యం వీర్నాపు, వీరేందర్ దేవిరెడ్డి, వంశీ తదితరులు వేడుక నిర్వహణలో భాగస్వాములు కానున్నారు.

**విరాళాల సేకరణ:**
ఈ సంస్థ చేపడుతున్న నేత్ర వైద్య సేవల కోసం సింగిల్ కాటరాక్ట్ సర్జరీకి 65 డాలర్లు, మేజర్ సర్జరీకి 250 డాలర్లు, వన్ డే మొబైల్ రూరల్ టెలి ఆప్తల్మాలజీ క్యాంపునకు 290 డాలర్లుగా విరాళాలు సేకరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి స్క్రీనింగ్ క్యాంపులు, వార్షిక కాటరాక్ట్ సర్జరీలు, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ (MESU) ఏర్పాటు వంటి వివిధ పథకాల ద్వారా విరాళాలు స్వీకరిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొని విరాళాలు అందించాలనుకునే వారు పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా సహకారం అందించవచ్చు.
Donation Link-
https://sankaranethralayausa.org/donation-page.html
Adopt a Village-
https://www.sankaranethralayausa.org/pdf/adopt-a-village-faq-flyer-15072026.pdf

## నవంబరు 1న 'క్యాట్స్' ఆధ్వర్యంలో దసరా, దీపావళి సంబరాలు

**వర్జీనియా:** రాజధాని ప్రాంతీయ తెలుగు సంఘం (Capitol Area Telugu Society-CATS) ఆధ్వర్యంలో ఈ సంవత్సరం దసరా, దీపావళి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంస్కృతి, సంగీతం, రుచికరమైన ఆహారం, ఉత్సాహభరితమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా ఆస్వాదించేందుకు తెలుగు ప్రజలను నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. నవంబరు ఒకటవ తేదీ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల (EST) వరకు వేడుకలు కొనసాగుతాయి. వర్జీనియాలోని ఆల్డీ/యాష్‌బర్న్ (Aldie/Ashburn) ప్రాంతంలో ఉన్న హైస్కూల్ వేదికగా జరిగే కార్యక్రమ వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు చెప్పారు.

# తెలుగు నవలా రచయితలకు 'సిరికోన సాహితీ అకాడమీ' ఆహ్వానం

**యూఎస్ఏ:** 'సిరికోన సాహితీ అకాడమీ' ఆధ్వర్యంలో జొన్నలగడ్డ రాంభొట్లు-సరోజమ్మ స్మారక 'సిరికోన నవలల పోటీ-2026' నిర్వహించనున్నారు. తెలుగు భాషలో మంచి నవలల రచనను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది పోటీకి 'మానవ సంబంధాల పట్ల యువతలో అనాసక్తత-మారుతున్న సామాజిక, కుటుంబ విలువలు' అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేశారు. ఈ అంశాన్ని ఆధారంగా చేసుకుని ప్రత్యేకంగా రాసిన నవలలు మాత్రమే పోటీకి అర్హత పొందుతాయి. ఉత్తమ నవలకు రూ.40వేల నగదు పురస్కారం అందించనుండగా.. న్యాయనిర్ణేతల సూచన మేరకు అర్హత సాధించిన ఇతర నవలలకు కూడా ప్రత్యేక పురస్కారాలు ప్రకటించే అవకాశం ఉంది. పోటీలో పాల్గొనే రచయితలు తమ నవలను కనీసం 120 పేజీల నుంచి గరిష్ఠంగా 200 పేజీల వరకు.. 12 పాయింట్ల అక్షర పరిమాణంలో రూపొందించాలి.




నవలను Word లేదా PDF ఫార్మాట్‌లో subbujvr@gmail.com ఈ-మెయిల్‌కు పంపాలి. పోటీ రచనలు 2026 డిసెంబరు 31లోగా చేరాలి. నవల ప్రతి మీద రచయిత/రచయిత్రి పేరు ఉండకూడదు. పూర్తి పేరు, చిరునామా, ఫోను నెంబరు, ఈ-మెయిల్ వివరాలను ప్రత్యేకంగా అందించాలి. పోటీ కోసం సమర్పించే రచనలో నిర్వాహకులకు సంబంధించిన వ్యక్తులు లేదా సంస్థల ప్రస్తావన ఉండకూడదని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఇతివృత్తం, పాత్ర చిత్రణ, నవలా శిల్పం వంటి అంశాల్లో ఉన్నతమైన మౌలిక ప్రమాణాలు కలిగిన రచనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

గతంలో పత్రికలు/సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన రచనలను పోటీకి అంగీకరించరు. నవల పూర్తిగా స్వతంత్ర రచన అయి ఉండటంతో పాటు.. గత సిరికోన నవలల పోటీల్లో 'ఉత్తమ' లేదా 'విశిష్ట' బహుమతులు పొందిన రచయితలు ఈసారి పోటీలో పాల్గొనడానికి అర్హులు కారు. పోటీ ఫలితాలు వెలువడే వరకు అదే నవలను ఇతర పోటీలకు పంపకూడదు. పురస్కారం పొందిన రచనలను ప్రచురించే సందర్భంలో జొన్నలగడ్డ రాంభొట్లు-సరోజమ్మ చిత్రంతో పాటు బహుమతి వివరాలను పుస్తకం ముఖపత్రం వెనుక భాగంలో తప్పనిసరిగా ప్రకటించాలి. పోటీకి సంబంధించిన పూర్తి నియమాలను పాటిస్తూ నవలతో పాటు ప్రత్యేక హామీపత్రాన్ని కూడా సమర్పించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం (+1) 214-621-1790 (US), Email: subbujvr@gmail.com, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, (+91) 99488 96984 (భారత్), నీలకంఠం నరసరాజు (+91) 99596 05656 (భారత్) నంబర్లలో సంప్రదించవచ్చు.


# ఫలించిన న్యాయ పోరాటం

### రెండేళ్ల నిరీక్షణ తర్వాత ఇద్దరు పిల్లలతో స్వదేశానికి భారతీయ మహిళ

**మనామా:** బహ్రెయిన్‌లో న్యాయపరమైన, పత్రాల చిక్కులతో దాదాపు రెండేళ్లు ఇబ్బందిపడ్డ భారతీయ మహిళ అరుణిమ బేబీ సమస్యకు ప్రవాసి లీగల్ సెల్ బహ్రెయిన్ చాప్టర్ చొరవతో పరిష్కారం లభించింది. అరుణిమ బేబీ ఇద్దరు పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్, రెసిడెన్సీ ప్రాసెస్ పూర్తి కాకపోవడంతో తీవ్ర ఆర్థిక, మానవీయ సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ క్రమంలో 2026 మార్చిలో ఆమె సహాయం కోసం ప్రవాసి లీగల్ సెల్‌ను ఆశ్రయించారు. PLC బహ్రెయిన్ చాప్టర్ అధ్యక్షుడు సుధీర్ తిరునిలత్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రిథిన్ రాజ్ స్పందించి... ప్యానెల్ లాయర్ అడ్వకేట్ తారిఖ్ అలోన్‌ను నియమించి కోర్టులో న్యాయ పోరాటం జరిపించారు. కోర్టు అనుకూల తీర్పు ఇవ్వడంతో చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. పిల్లల ఆసుపత్రి వైద్య బిల్లు BD 597 (బహ్రెయిన్ దినార్లు) పెండింగ్‌లో ఉండగా, షిఫా అల్ జజీరా మెడికల్ సెంటర్ యాజమాన్యం మానవత్వంతో స్పందించి 70 శాతం డిస్కౌంట్ ఇచ్చింది. దీంతో ఆ చెల్లింపుల మొత్తం BD 180కి తగ్గడంతో కుటుంబానికి పెద్ద ఊరట లభించింది. భారత రాయబార కార్యాలయం, ఇమ్మిగ్రేషన్ అధికారులు, ఇంటి యజమాని అందించిన సహకారంతో అవసరమైన ప్రయాణ పత్రాల ప్రక్రియ పూర్తయింది. దీంతో మూడు రోజుల క్రితం అరుణిమ తన పిల్లలు గ్రీవా మరియం, జయాన్ మహమ్మద్‌లతో కలిసి ఎయిర్ ఇండియా విమానంలో బహ్రెయిన్ నుంచి కోచికి తిరుగు ప్రయాణమైంది.



## అమిత్ షాకు అస్వస్థత



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అస్వస్థతకు గురయ్యారు. షెడ్యూల్ ప్రకారం శనివారం ఆయన కర్ణాటక లోని హుబ్బళ్లిలో రూ.700 కోట్లతో నిర్మించిన కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహా స్వామిగళు మూరుసావిర మఠ్ మెడికల్ కళాశాల నూతన భవనంతోపాటు, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో, శుక్రవారం రాత్రే ఆయనహుబ్బళ్లిలోని హోటల్‌కు చేరుకున్నారు. అక్కడఅస్వస్థతకు గురికావడంతో వైద్యుల సలహా మేరకు కార్యక్రమానికి హాజరుకాకుండా హోటల్లోనే ఉండిపోయారు. అమిత్ షా గైర్హాజరైన నేపథ్యంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి,కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్, రాజ్యసభ మాజీ ఎంపీ ప్రభాకర్ కోరే మాట్లాడుతూ.. ఈచరిత్రాత్మక కార్యక్రమానికి అమిత్ షా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. ఆరోగ్య కారణాల రీత్యా దూరంగా ఉన్నారని వెల్లడించారు.

## తమిళనాడులో స్కూల్ పిల్లలకు చికెన్ బిర్యానీ



మధ్యాహ్న భోజనపథకం ద్వారా పిల్లలకు మాంసాహారాన్ని అందించాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆ రాష్ట్ర సీఎం విజయ్, విద్యాశాఖ మంత్రి రాజ్‌మోహన్ కలిసి ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఈపథకం ప్రయోగాత్మక దశలోఉంది. పేద విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందించాలనే ఆలోచనతో ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు రాజ్‌మోహన్ తెలిపారు. అయితే ఉన్నపళంగా దీన్ని ప్రవేశపెట్టడంలు చుకోలేదని ఆయన చెప్పారు. భద్రత, శుభ్రతలను పాటిస్తూ ఈపథకాన్ని ఎలా అమలు చేయవచ్చనే అవగాహన కోసం తొలుత ఎంచుకున్న కొన్ని పాఠశాలల్లోనే అమలుచేయాలని నిర్ణయిం చుకున్నామని ఆయనవివరించారు. జైలు ఖైదీల కోసం కూడా చికెన్ బిర్యానీని వండి వారుస్తున్నప్పుడు.. చిన్నారుల కోసం వండలేమా అని ప్రశ్నించారు. ఈ పథకానికి జులై నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా బిర్యానీ ఉన్న రోజు శాకాహారుల కోసం ప్రత్యేక ఆహారం కూడా ఉండేలా పథకం నమూనా తయారైంది. తమిళనాడు ప్రభుత్వం భోజన పథకంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెడుతోంది. ఇప్ప టికే ప్రభుత్వ బడుల్లో ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నారు. అత్యంత పరిశుభ్రంగా ఆహారాన్ని తయారు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అలాగే బ్రేక్‌ఫాస్ట్‌లో జాబితాలో కూడా మార్పులు చేస్తామని, పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారాన్నే ఇస్తామని వివరిస్తోంది.

## వాగులో కొట్టుకుపోయిన కారు

### ఎనిమిది మంది మృతి

మధ్యప్రదేశ్‌లో విషాదం చోటుచేసుకుంది. భారీ వరదల కారణంగా కారు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయిన దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. అగర్ మాల్వా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నల్ఖేడా బగళాముఖి మాత ఆలయ సమీపంలో ఈవిషాదం జరిగింది.నల్ఖేడా ప్రాంతంలో భారీవానల కారణంగా వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.వాగుపై ఉన్నవంతెన పైనుంచి నీరు ఉధృతంగా పారుతున్నప్పటికీ, డ్రైవర్ కారును కల్వర్టుపైనుంచి ప్రమాదకరంగా నడిపారు. దీంతో కారుని వరద నీరు ముంచెత్తడంతో కారు అదుపు తప్పి వాగులో పడిపోయింది.వరదఉధృతి భయంకరంగా ఉండటంతో కారు క్షణాల్లోనే నీటిలో కొట్టుకుపోయింది. సమాచారం అందుకున్నవెంటనే స్థానిక పోలీసులు,విపత్తు నిర్వహణ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి ఎట్టకేలకు కారును వెలికితీశారు. అయితే అప్పటికే అందులో ఉన్న ఎనిమిది మంది దుర్మరణం చెందారు. మృతులంతా ఒడిస్సాకు చెందిన వారిగా తెలుస్తోంది. కాగా గత కొద్దిరోజులుగా మధ్యప్రదేశ్ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

# వేలాది కుటుంబాల్లో 'రోజ్‌గార్ మేళా' వెలుగులు

- **స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు ఉద్యోగ అవకాశాలు**
- **20వ 'రోజ్‌గార్ మేళా' ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ**






పలు దేశాలతో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందన్నారు. దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన 20వ 'రోజ్‌గార్ మేళా'లో 51వేల మందికి పైగా యువతకు కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోదీ, 2047 నాటికి భారత్‌ను 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)గా మార్చే ప్రయాణంలో యువతదే అత్యంత కీలక పాత్ర అని స్పష్టం చేశారు. దేశంలో పండుగల సీజన్ ప్రారంభమైన వేళ, వేలాది కుటుంబాల్లో ఈ ఉద్యోగాలు కొత్త ఆనందాన్ని నింపాయని ప్రధాని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతున్న తరుణంలో యువత ప్రభుత్వంలో చేరుతున్నారని, వీరు తీసుకునే ప్రతి నిర్ణయం 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' ఆశయాల్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

భారతీయ యువత నైపుణ్యాలపై ప్రపంచానికి ఎంతో నమ్మకం ఉందని ప్రధాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లలో దాదాపు 40 దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు యువతకు నూతన ఉద్యోగ, వ్యాపార అవకాశాలను తెచ్చాయని చెప్పారు. రూ. 60,000 కోట్ల వ్యయంతో 'పీఎం సేతు' పథకం ద్వారా 1,000 ప్రభుత్వ ఐటీఐ లను పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్ భారత్‌లో ఉందన్న ప్రధాని, గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో సగానికి పైగా టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని, చిన్న నగరాల యువత ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ప్రశంసించారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు రూ. లక్ష కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించామని, దీని ద్వారా తొలిసారి ఉద్యోగంలో చేరే దాదాపు 2 కోట్ల మంది యువతకు రూ. 15,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ 20వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. రైల్వే, హోం శాఖ, రక్షణ, రెవెన్యూ, ఆరోగ్య, ఆర్థిక సేవల శాఖల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను అందించారు. ఇప్పటివరకు నిర్వహించిన రోజ్‌గార్ మేళాల ద్వారా మొత్తం దాదాపు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు లభించాయి.

# ఆధునిక వాతావరణ సవాళ్లకు భారత్ పరిష్కారాలు

### - ఎన్జీటీ అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ

ప్రపంచం ఎదుర్కొంటున్న ఆధునిక వాతావరణ సవాళ్లకు భారత్ పరిష్కారాలు అందిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో అంతర్జాతీయ పర్యావరణ, వాతావరణ సదస్సు ప్రారంభమైంది. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' పేరుతో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రధాని మోదీ శనివారం విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభించారు. ఈ సదస్సును జాతీయ హరిత న్యాయస్థానం (ఎన్‌జీటీ) నిర్వహిస్తోంది. ఈ అంతర్జాతీయ సదస్సులో భారత్‌తో పాటు 17 దేశాలకు చెందిన ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయ ప్రతినిధులు పాల్గొంటున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. 'పీఎం సూర్యఘర్' పథకం విజయవంతమైందని, 50 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటయ్యాయని అన్నారు. అభివృద్ధి, స్థిరత్వం రెండూ సమాంతరంగా సాగాలి. భారత్ స్థిరమైన అభివృద్ధి సాధిస్తూ వస్తోంది. భారత్‌లో ఈవీ విప్లవం రావాల్సిన అవసరం ఉంది. 2025లో 25 లక్షల ఈవీ వాహనాల అమ్మకాలతో రికార్డు



సృష్టించాం. భారత్‌లో రైల్వేల విద్యుద్దీకరణ వందశాతం పూర్తయింది. రైల్వేల విద్యుద్దీకరణతో కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అవుతోంది. షెడ్యూల్‌కు ముందే కాప్ 21 లక్ష్యాలను భారత్ అందుకుంది. ఇచ్చిన హామీలను ఇప్పటికే అమలు చేశాం. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై పూర్తిస్థాయి దృష్టి సారించాం. సౌర, పవన విద్యుత్ లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకోవాలి. శతాబ్దాలుగా ప్రకృతి, పర్యావరణ అంశాల్లో ప్రపంచానికి భారత్ మార్గనిర్దేశం వహిస్తోంది. కర్బన ఉద్గారాల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలను అనవసరంగా నిందిస్తున్నారు. భారత తలసరి కర్బన్ ఉద్గారాల శాతం.. ప్రపంచ సగటులో సగం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన దేశాల తలసరి కర్బన ఉద్గారాలు భారత్‌తో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని మోదీ చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న పర్యావరణ, వాతావరణ సవాళ్లపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. పర్యావరణ విధానాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలో ఉన్న లోపాలను గుర్తించడంతో పాటు వివిధ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలు, ఉత్తమ పద్ధతులపై అనుభవాలను పంచుకోనున్నారు. వాతావరణ న్యాయం, జీవవైవిధ్యం, పర్యావరణ చట్టాలు, పునరుత్పాదక ఇంధనం, అడవుల పరిరక్షణ, పర్యావరణ పరిపాలన వంటి అంశాలపై సదస్సులో సాంకేతిక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# మమతా బెనర్జీ వర్గంలో నామినేషన్ల హైడ్రామా!

పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికలు దగ్గరపడుతోన్న వేళ.. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గంలో నామినేషన్ల హైడ్రామా నడుస్తోంది. ఇప్పటికే నందిగ్రామ్ స్థానంలో ఆమె పార్టీకి చెందిన టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ శుక్రవారం ఉపఎన్నిక బరి నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. ఒక్కరోజు కూడా గడవక ముందే.. రేజినగర్ స్థానానికి పోటీ చేస్తోన్న మమత వర్గం అభ్యర్థి రబియుల్ ఆలం చౌదరి కూడా నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారు. అయితే, కొన్ని గంటలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం.

పార్టీ కార్యకర్తల తీరు సరిగా లేదని ఆరోపిస్తూ పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు శనివారం ఉదయం రబియుల్ ప్రకటించారు. అయితే, తాను పోటీలోనే ఉంటున్నట్లు మధ్యాహ్నం ఆయన మరో ప్రకటన చేశారు. మమతా బెనర్జీ ఫోన్ చేయడంతో వెనక్కి తగ్గినట్లు ఆయన పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ లో నందిగ్రామ్ తోపాటు రెజినగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. కాగా నందిగ్రామ్ స్థానం నుంచి తాము కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తామని మమత ఇప్పటికే ప్రకటించారు. ఆమె ఈ ప్రకటన చేసిన గంటల వ్యవధిలోనే ఓ కేసులో కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్‌ను బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేయడం చర్చనీయాంశమైంది.

**సుప్రీంను ఆశ్రయించిన మమత..**

తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల రెండుగా చీలిపోవడం.. తమదే అసలైన పార్టీ అని ప్రకటించుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో పార్టీ పేరు, దాని ఎన్నికల చిహ్నమైన 'పూలు గడ్డి'ని ఉపయోగించరాదని ఇరువర్గాలకు ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. ఆ తర్వాత ఆ రెండు వర్గాలకు వేర్వేరు పేర్లు, గుర్తులను కేటాయించింది. దీనిని సవాల్ చేస్తూ మమతా బెనర్జీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.





# హెచ్-1బీపై ట్రంప్ కఠిన వైఖరి

## - లక్ష డాలర్ల ఫీజు మరో ఏడాది పొడిగింపు




హెచ్-1బీ వీసా విషయంలో లక్ష డాలర్ల చెల్లింపు నిబంధనను మరో ఏడాది పాటు పొడిగిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కఠిన నిర్ణయం తీసుకున్నారు. 2025లో తీసుకొచ్చిన ఈ నిబంధన ఈ నెలలో ముగియాల్సి ఉంది. తాజాగా దీనిని 2027 సెప్టెంబర్ 21 వరకు పొడిగించారు.

విదేశీ ఉద్యోగులను హెచ్-1బీ కేటగిరీ కింద అమెరికాలోకి తీసుకురావాలంటే వారి దరఖాస్తుతో పాటు లక్ష డాలర్ల చెల్లింపు అవసరమయ్యేలా ట్రంప్ 2025 సెప్టెంబర్‌లో నిబంధన తీసుకొచ్చారు. ఏడాది పాటు ఈ నిబంధన అమల్లో ఉంటుందని అప్పట్లో ప్రకటించారు. అయితే తాజాగా ఆ నిబంధనను మరో ఏడాది పాటు పొడిగించారు.

సాధారణంగా ఈ వీసా దరఖాస్తుల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజు ను ట్రంప్ సర్కార్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసింది. 2025లో తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఐటీ సేవలను అవుట్సోర్సింగ్ ఇస్తున్న కంపెనీల హెచ్-1బీ రిజిస్ట్రేషన్లలో 92 శాతం తగ్గుదల నమోదైందని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. దీంతో అమెరికన్ కార్మికులు, గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. అత్యంత నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే కంపెనీలు నియమించుకునేలా చూడటం తమ ప్రధాన ఉద్దేశమని ట్రంప్ సర్కార్ చెబుతోంది.

హెచ్-1బీ కార్యక్రమంలో కొన్ని సంస్థలు అక్రమాలకు పాల్పడుతున్నాయని ట్రంప్ యంత్రాంగం ఎప్పట్నుంచో ఆరోపిస్తోంది. అమెరికన్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుంటూ చాలా సంస్థలు ఈ వీసా కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపణలు చేస్తోంది. దీంతోనే ఈ నిబంధనను ట్రంప్ ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తోంది.

హెచ్-1బీ వీసాలపై భారతీయ సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో ఆధారపడ్డారు. ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్, తదితర రంగాల్లో అమెరికాలో ఉద్యోగాల కోసం ఈ వీసా కీలకంగా ఉంది. ఈ లక్ష డాలర్ల ఫీజు నిబంధన భారతీయులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

కాగా, అమెరికాలో ఇప్పటికే ఉన్న హెచ్-1బీ ఉద్యోగుల రెన్యువల్స్‌కు ఈ లక్ష డాలర్ల చెల్లింపు వర్తించదు. అమెరికాలో విద్యార్థి వీసాలపై ఉండి హెచ్-1బీ వీసాల కు దరఖాస్తు చేసుకునేవారికి ఈ ఫీజు వర్తించదు. అయితే, బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తు దారులుమాత్రం ఈమొత్తం చెల్లించాల్సి ఉంటుంది.

ఈ లక్ష డాలర్ల రుసుమును అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో సవాలు చేయగా.. ఆ ఫీజు చట్టవిరుద్ధమని తీర్పు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ అంశం ఇతర ఫెడరల్ కోర్టుల్లో విచారణదశలో ఉంది. ఈ ఫీజుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ.. లక్ష డాలర్ల ఫీజును మరో ఏడాది పాటు పొడిగిస్తూ ట్రంప్ ఇప్పుడు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

# జిన్‌పింగ్‌కు వైట్‌హౌస్‌లో ట్రంప్ విందు

## హాజరుకానున్న టెక్ కంపెనీల దిగ్గజాలు



చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే వారం వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇవ్వనున్న డిన్నర్ కార్యక్రమంలో జిన్‌పింగ్‌తో పాటు దిగ్గజ టెక్ కంపెనీల అధినేతలు కూడా పాల్గొననున్నారు. ఎన్‌విడియా హెడ్ బాస్ జెన్సన్ హువాంగ్, ఓపెన్ ఏఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ ఆల్ట్‌మన్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, స్పేస్ ఎక్స్ అండ్ టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్, యాపిల్ హెడ్ టిమ్ కుక్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఈ డిన్నర్ ఈవెంట్‌కు హాజరు కానున్నారని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ అమెరికా అధికారి తెలిపారు. ఏఐ రంగంలో అమెరికా, చైనా రెండు ప్రధాన శక్తులుగా ఎదుగుతున్న నేపథ్యంలో ట్రంప్, జిన్‌పింగ్ నేతల మధ్య జరిగే చర్చల్లో ఏఐ కీలక అంశంగా మారనుంది. ఈ తరుణంలో దిగ్గజ టెక్ కంపెనీల అధినేతలు ఈ భేటీకి హాజరు కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఆవిష్కరణల వేగవంతంపైనే దృష్టి

అమెరికాలో ఏఐపై జరుగుతున్న చర్చల్లో ప్రస్తుతం ఒక అంశం ప్రధానంగా కనిపిస్తోంది. ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్, గూగుల్, మెటా వంటి ప్రముఖ ఏఐ కంపెనీలు తమ ఆవిష్కరణల వేగాన్ని తగ్గించకూడదని భావిస్తున్నాయి. ఆవిష్కరణల విషయంలో నెమ్మదిగా వెళ్తే, అత్యాధునిక ఏఐ రంగంలో అమెరికాను చైనా దాటిపోయే అవకాశం ఉందని దిగ్గజ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. కొంతకాలంగా అత్యాధునిక ఏఐ విషయంలో అమెరికా కన్నా వెనుకబడి ఉందని భావిస్తున్న చైనా.. ఇప్పుడు ఆ అంతరాన్ని చాలా వేగంగా తగ్గిస్తోంది. అత్యాధునిక ఏఐ అభివృద్ధికి అవసరమైన అధునాతన చిప్‌లను చైనాకు అందకుండా చేసి చైనా వేగాన్ని అడ్డుకోవడానికి అమెరికా చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఎన్‌విడియా తయారు చేసే అత్యున్నత స్థాయి సెమీకండక్టర్ చిప్‌లు చైనాకు అందకుండా అమెరికా జాగ్రత్తలు తీసుకుంది. ఇక అమెరికా, చైనా మధ్య ఏఐ విషయంలో తీవ్రమైన పోటీ ఉన్నా.. ఈ రెండు దేశాల అధినేతలు సమావేశమైనప్పుడు ఏఐ టెక్నాలజీకి సంబంధించి ఏదైనా ఒక అంశంపై ఒక ఒప్పందానికి రావచ్చని సమాచారం.

### ట్రంప్ కీలక వ్యాఖ్యలు

జిన్‌పింగ్ పర్యటన నేపథ్యంలో చైనాను ఉద్దేశించి ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ.. అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం చేస్తోందని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు.




# గ్రీన్‌లాండ్ భద్రతపై అమెరికా కీలక ఒప్పందం

గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. డెన్మార్క్, గ్రీన్‌లాండ్ కలిసి అమెరికాతో ఒక కొత్త భద్రతా ఒప్పందానికి అంగీకరించినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా గ్రీన్‌ల్యాండ్ భద్రతపై అమెరికాకు 'శాశ్వత నియంత్రణ' లభిస్తుందని ట్రంప్ ప్రకటించారు. అలాగే దీనిని ఆయన "ఇన్ఫినిట్ లైఫ్ అగ్రిమెంట్"గా అభివర్ణించారు. దీనిపై డెన్మార్క్ స్పందిస్తూ.. ట్రంప్ చేసిన తాజా ప్రకటన అర్థం ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని కాదు.. కేవలం భద్రతకు సంబంధించిన ఒప్పందం మాత్రమే అని స్పష్టం చేసింది. గ్రీన్‌లాండ్ ఇక మీదట కూడా డెన్మార్క్ రాజ్యంలోనే కొనసాగుతుందని, ఆదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను, అక్కడి ప్రజల స్వయం నిర్ణయ హక్కును ఒప్పందం గుర్తిస్తుందని డెన్మార్క్ తెలిపింది. అమెరికా, డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రభుత్వాలు వచ్చే వారం ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సందర్భంగా న్యూయార్క్‌లో ఈ ఒప్పందంపై సంతకాలు చేయనున్నాయి. అనంతరం అవసరమైన పార్లమెంటరీ ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఇది అమల్లోకి రానుంది.

### రష్యా, చైనాకు చెక్

గ్రీన్‌లాండ్ లో అమెరికా ప్రత్యర్థి దేశాలు సైనిక స్థావరాలు ఏర్పాటు చేయకుండా ఈ ఒప్పందం అడ్డుకట్ట వేస్తుందని ట్రంప్ చెప్పారు. ముఖ్యంగా రష్యా, చైనాలు అక్కడ సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడం, సైనిక ఉనికిని పెంచడం లేదా సున్నితమైన పెట్టుబడులు పెట్టడం అమెరికా అనుమతి లేకుండా సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. అమెరికా ఇప్పటికే గ్రీన్‌లాండ్‌లో పిటుఫిక్ స్పేస్ బేస్‌ను నిర్వహిస్తోంది. క్షిపణి హెచ్చరికలు, క్షిపణి రక్షణ, అంతరిక్ష నిఘా వంటి కార్యకలాపాల్లో ఈ స్థావరం కీలకంగా ఉంది. కొత్త ఒప్పందంతో గ్రీన్‌లాండ్‌లో అమెరికా సైనిక ఉనికిని మరింత పెంచుకునే అవకాశం ఏర్పడినట్లు తాజా వివరాలు సూచిస్తున్నాయి.

### ట్రంప్ వ్యాఖ్యకు అర్థమేంటి?

ఈ ఒప్పందానికి గడువు ఉండదనే అర్థంలో ట్రంప్ దీనిని"ఇన్ఫినిట్ లైఫ్ అగ్రిమెంట్'గా పేర్కొన్నారు. గ్రీన్లాండ్, అమెరికా భద్రతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం అమెరికాకు ఎప్పటికీ ఉంటుందని ఆయన అన్నారు. గ్రీన్ లాండ్‌లో పెద్ద ఎత్తున అమెరికా సైనిక ఉనికిని అభివృద్ధి చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు.

### ఎందుకంత కీలకం?

ఆర్కిటిక్ ప్రాంతంలో ఉన్న గ్రీన్‌లాండ్ భౌగోళికంగా అత్యంత కీలకమైన ప్రదేశం. ఉత్తర అమెరికా, యూరప్ మధ్య ఉన్న ప్రాంతంలో దాని స్థానం కారణంగా అమెరికా రక్షణవ్యూహంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రష్యా, చైనా ఆర్కిటిక్ ప్రాంతంలో తమ ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో గ్రీన్ లాండ్‌పై అమెరికా దృష్టి మరింత పెరిగింది.

# రష్యా ఆంక్షల బిల్లుపై ట్రంప్ సంతకం

## - భారత్‌పై 100 శాతం సుంకాల విధింపునకు అధికారం



రష్యా, ఇరాన్, చైనా, భారత్లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాలపై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం ప్రతినిధుల సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాపై ఆర్థికంగా ఒత్తిడి పెంచడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. అదే సమయంలో రష్యా నుంచి చమురు, సహజ వాయువు కొనుగోలు చేసే కొన్ని దేశాలపై భారీ దిగుమతి సుంకాలు విధించే అధికారాన్ని కూడా అమెరికా అధ్యక్షుడికి ఈ చట్టం కల్పిస్తోంది.

రష్యా నుంచి భారీ స్థాయిలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా ఉన్నాయి. అందువల్ల ఈ రెండు దేశాలపై ఈ కొత్త చట్టం ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ చట్టం ప్రకారం రష్యా నుంచి చమురు లేదా సహజ వాయువు కొనుగోలు చేసే కొన్ని ప్రధాన దేశాల దిగుమతులపై గరిష్ఠంగా 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించే అధికారం ట్రంప్‌నకు దక్కింది. దీంతో భారత్ లేదా చైనా ఉత్పత్తులపై ఎంత శాతం సుంకాలు విధించాలనే నిర్ణయం ఇప్పుడు ట్రంప్ చేతుల్లోకి వెళ్లింది.

ఈ కొత్త చట్టాన్ని అమలు చేసి భారత్‌పై అధిక సుంకాలు విధిస్తే, అమెరికా మార్కెట్‌కు ఎగుమతి అవుతున్న భారతీయ వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంటుంది.

అయితే ఆ ప్రభావం ఎంత ఉంటుందనేది అమెరికా ప్రభుత్వం భవిష్యత్తులో నిర్ణయించే సుంకాల రేటు, ఏ ఉత్పత్తులపై వాటిని విధిస్తారు, ఎప్పుడు అమలు చేస్తారు అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. భారత్ ఇప్పటికే ఈ పరిణామంపై స్పందించింది. దేశ వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చరించింది. మరోవైపు అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. భద్రతా మండలి ఆమోదం లేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరా చేసే నౌకల షాడో ఫ్లీట్పైనా ఆంక్షలు విధించడానికి ఈ చట్టంతో అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది.

స్పోర్ట్స్
చైతన్యరథం



### రచిన్ రవీంద్రకు గాయం..

## భారత్‌తో సిరీస్‌కు దూరం

న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర అనూహ్యంగా గాయపడ్డాడు. ఓ యాడ్ షూట్‌లో భాగంగా డైవింగ్ క్యాచ్ పట్టే ప్రయత్నంలో అతడి కుడి భుజం ఎముక స్థానభ్రంశం అయింది. క్యాచ్ కోసం వెళ్లిన రచిన్.. సేఫ్టీ మ్యాట్‌పై అనుకోకుండా ఇబ్బందికరంగా పడిపోవడంతో భుజానికి తీవ్ర గాయమైంది. దీంతో అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానున్న భారత్-న్యూజిలాండ్ సిరీస్‌కు రచిన్ రవీంద్ర దూరం కానున్నట్లు సమాచారం.

భారత్-న్యూజిలాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టును వచ్చే వారం ప్రకటించనున్నారు. మరోవైపు న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ కూడా రచిన్ విషయంలో తొందరపడబోమని స్పష్టం చేశాడు. రాబోయే ఆరు నెలల్లో అతడికి భారీ టెస్టు షెడ్యూల్ ఉంది. అందుకే అవసరమైన దానికంటే ముందుగానే రచిన్‌ను మైదానంలోకి తీసుకురావాలని మేం అనుకోవడం లేదు. అతడికి అత్యుత్తమ వైద్య సహాయం, రిహాబిలిటేషన్ అందుతోంది. త్వరలోనే అతడిని తిరిగి మైదానంలో చూడాలని ఎదురుచూస్తున్నామని తెలిపాడు.

## భారత్‌కు మరోసారి నక్వీ గండం!



ఆసియా క్రీడల్లో భారత జట్టుకు మరోసారి మొహిసిన్ నక్వీ గండం ఎదురవుతుందా? ఈ సందేహం ఇప్పుడు క్రీడాభిమానులను కలవరపెడుతోంది. భారత పురుషుల జట్టు 2025ఆసియా కప్, భారత మహిళల జట్టు 2026ఆసియా కప్ టైటిళ్లు గెలిచినప్పటికీ.. ఆసియా క్రికెట్ సంఘం(ఏసీసీ) అధ్యక్షుడుగా ఉన్న పాకిస్థాన్‌కు చెందిన మొహిసిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి నిరాకరించాయి. త్వరలో జపాన్ వేదికగా ఆసియా క్రీడలు జరగబోతున్నాయి. ఈ క్రీడల్లో భారత జట్టు పతకాలు సాధిస్తే.. వాటిని మొహిసిన్ నక్వీ అందజేస్తే స్వీకరిస్తారా అనే చర్చ మొదలైంది.

ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) నిబంధనల ప్రకారం పతకాలను ఓసీఏ అధ్యక్షుడు లేదా ఆయన నియమించిన ప్రతినిధి అందజేస్తారు. విజయోత్సవ కార్యక్రమాల్లో రాజకీయ ప్రదర్శనలు లేదా ప్రచారానికి అనుమతి ఉండదు. ప్రస్తుతం ఓసీఏలో నక్వీ కూడా సభ్యుడిగా ఉన్నారు. కొన్ని సందర్భాల్లో ఈ పతకాలు అందించే బాధ్యతను ఓసీఏలోని ఇతర సభ్యులకు కూడా అప్పగించే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. ఒకవేళ ఓసీఏ అధ్యక్షుడు అయిన షేక్ జోవాన్ బిన్ హమద్ అల్ థానీ.. నక్వీకి అధికారికంగా ఈ బాధ్యతను అప్పగిస్తే, భారత అథ్లెట్లు తమ పతకాలను స్వీకరించాల్సి ఉంటుంది. ఒకవేళ పతకాలు తీసుకోవడానికి నిరాకరిస్తే, దానిని క్రీడలను, ఓసీఏను అగౌరవపరిచినట్లుగా పరిగణిస్తారు. దీని ఫలితంగా క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. ప్రస్తుతం మేము కేవలం మ్యాచ్‌ల మీదే దృష్టి సారిస్తున్నాం. జట్టు ముందుగా పోడియంపైకి చేరుకోవాలి. ఆ క్షణంలో ఉన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని అప్పుడు మేము ఒక నిర్ణయం తీసుకుంటాము. ఆ సమయం వచ్చినప్పుడు దాని గురించి ఆలోచిస్తాము. ప్రస్తుతం బోర్డు, ఆటగాళ్ల దృష్టి కేవలం మ్యాచ్‌లు గెలవడంపైనే ఉంది. ఎప్పుడో ఎదురయ్యే ఇతర విషయాలపై మేము వ్యాఖ్యానించదలుచుకోలేదని స్పష్టం చేశారు.

# ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం

### - భారత పతాకధారులుగా మను భాకర్, పవన్ సెహ్రావత్



జపాన్‌లోని అయిచి-నగోయా వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జపాన్‌లోని పాలోమా మిజుహో స్టేడియంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత స్టార్ షూటర్ మను భాకర్, కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్ భారత పతాకధారులుగా వ్యవహరించారు. ఈ ఇద్దరి నేతృత్వంలో భారత అథ్లెట్ల బృందం పరేడ్‌లో పాల్గొంది.

ఈసారి ఆసియా క్రీడల కోసం భారత్ 503 మంది క్రీడాకారులతో కూడిన భారీ బృందాన్ని బరిలోకి దింపింది. మొత్తం 36 క్రీడాంశాల్లో భారత అథ్లెట్లు పోటీపడనున్నారు. గత ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత పురుషుల కబడ్డీ జట్టులో సభ్యుడైన పవన్ సెహ్రావత్.. మను భాకర్‌తో కలిసి భారత బృందానికి నాయకత్వం వహించాడు.

**చాలా గర్వంగా ఉంది: మను**

భారత పతాకధారిగా ఎంపిక కావడంపై మను భాకర్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ విషయం తెలిసిన వెంటనే నా షూటింగ్ ప్రస్థానం మొత్తం కళ్ల ముందు మెదిలింది. షూటింగ్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఒకరోజు ఈ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. అందుకే ఇది నాకు ఎంతో భావోద్వేగంతో కూడిన అనుభూతి. నా దేశానికి పతాకధారిగా ఎంపిక కావడం గర్వంగా, గౌరవంగా, ఎంతో సంతోషంగా ఉంది. నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని మను పేర్కొంది.

**తజీందర్ స్థానంలో పవన్..**

పురుషుల విభాగంలో తొలుత షాట్‌పుట్ స్టార్ తజీందర్ పాల్ సింగ్ తూర్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల అతడి స్థానంలో పవన్ సెహ్రావత్‌ను నియమించారు. మరోవైపు ఆసియా క్రీడల్లో పురుషుల కబడ్డీలో మరోసారి స్వర్ణం సాధించడమే లక్ష్యంగా పవన్ బరిలోకి దిగనున్నాడు. గత ఆసియా క్రీడల్లో భారత్ అత్యుత్తమ ప్రదర్శనతో 107 పతకాలు సాధించింది. ఇందులో 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలు ఉన్నాయి. ఈసారి ఆ సంఖ్యను అధిగమించాలనే లక్ష్యంతో భారత క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు.

# టీమిండియాకు జెర్సీ ఇబ్బందులు



ఆసియా క్రీడల కోసం బయలుదేరేముందు టీమిండియా క్రికెట్ జట్టుకు కిట్ సమస్య ఎదురయింది. భారత క్రికెట్ జట్టు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరి అతిథ్య దేశంతో ఈ నెల 22న టీ20 మ్యాచ్ కూడా ఆడనుంది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లకు కిట్ సమస్యలు వచ్చాయి. తమ జెర్సీ సైజ్ విషయంలో వారు ఇబ్బంది పడినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆటగాళ్లు బయల్దేరడానికి కొన్ని గంటలే మిగిలి ఉండటంతో ఈ ఇబ్బందిని పరిష్కరించేందుకు బీసీసీఐ రంగంలోకి దిగింది. ఇండియన్ ఒలింపిక్ అసోషియేషన్ (ఐఓఏ)కు లైఫ్‌స్టైల్ కిట్ పార్టనర్‌గా వ్యవహరిస్తోన్న జేవీస్ డబ్ల్యూ ఇన్స్‌పైర్ క్రికెట్ బోర్డు చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

జపాన్‌లో జరిగే టీ20 మ్యాచ్‌కు ఆటగాళ్లు అంతర్జాతీయ టోర్నీలకు వినియోగించే తమ స్టాండర్డ్ కిట్‌ను ఉపయోగించనున్నారు. తర్వాత అధికారిక ఆసియా గేమ్స్ జెర్సీని ధరించాల్సి ఉంది. అయితే, ఇక్కడే క్రికెటర్ల జెర్సీలు, ఇతర దుస్తుల సైజు విషయంలో సమస్యలు వచ్చాయని, వాటిలో చాలావాటిని సరిదిద్దామని ఐఓఏ వర్గాలు వెల్లడించాయి. సరిచేసిన కిట్లు త్వరలోనే జట్టుకు అందుతాయని చెప్పాయి. ప్రస్తుతం ఆటగాళ్లకు రెండు వేర్వేరు జెర్సీల అవసరముందని, అలాంటప్పుడు కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతుంటాయని పేర్కొన్నాయి. ఈ కిట్లో జెర్సీతో పాటు ట్రావెల్ గేర్, క్యాజువల్ అథ్లెటిక్ వేర్ వంటివి ఉంటాయి.

**వసతి సమస్య కూడా..**

ఆసియా క్రీడల అతిథ్యనగరం నగోయాలో భారత అథ్లెట్లకు వసతి కేటాయింపు విషయంలో తీవ్ర ఆలస్యం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీంతో బీసీసీఐ పురుషుల జట్టు కోసం స్వయంగా వేరే హోటల్లో వసతి ఏర్పాట్లు చేసింది. భారత మహిళల క్రికెట్ జట్టుకు మాత్రం ఐఓఏ ఏర్పాటు చేసిన వసతినే ఉపయోగించుకుంటుంది. వారికి ఎలాంటి సమస్యా లేదని తెలిపింది..

ఆసియా క్రీడల క్రికెట్ టోర్నీకి ముందు జపాన్‌తో సెప్టెంబర్ 22న భారత్ టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ రెండు దేశాల మధ్య జరిగే తొలి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఇదే. భారత్- జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవానికి ప్రారంభ సూచికగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ మ్యాచ్ ఆసియా క్రీడల అధికారిక పోటీల్లో భాగం కాదని క్రీడా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇది స్నేహపూర్వక మ్యాచ్ కావడంతో భారత ఆటగాళ్లు సాధారణ బీసీసీఐ కిట్‌తోనే ఆడనున్నారని తెలిపింది. భారత జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఆసియా క్రీడల జట్టులో ఉన్నాడు.

అయిచి-నగోయా వేదికగా 20వ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్నాయి. భారత్ 36 క్రీడాంశాల్లో పాల్గొంటోంది. గత ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్‌లో స్వర్ణం సాధించిన భారత్.. ఈసారి సెప్టెంబర్ 28న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది.

# టెక్‌బాల్ సెమీస్‌లో ఓడిన క్విమ్సి

### - పతకానికి ఇంకా అవకాశం

ఆసియా క్రీడల్లో టెక్‌బాల్ మహిళల సింగిల్స్‌లో ఆది నుంచి అదరగొట్టిన క్విమ్సి డిసౌజా.. సెమీస్‌లో ఓటమి ఎదురయింది. ఇండోనేసియా క్రీడాకారిణి సుమయా చేతిలో పరాజయం పాలయింది. అయితే క్విమ్సికి ఇప్పటికీ పతకఅవకాశాలు మిగిలే ఉన్నాయి. ఆదివారం ఆమె కాంస్యం కోసం పోటీ పడనుంది. సెమీస్ ను అద్భుతంగా ఆరంభించిన డిసౌజా మొదటి సెట్‌ను 12-7 తేడాతో గెలుచుకుంది. అయితే రెండో సెట్‌లో సుమయా అనూహ్యంగా పుంజుకుని.. 12-9తేడాతో సెట్ గెల్చుకుంది. ఆ తర్వాత నిర్ణయాత్మక మూడో సెట్లో ఇండోనేసియా క్రీడాకారిణి 12-7 తేడాతో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా.. సెమీస్‌లో ఓడిన వారు కాంస్యం కోసం పోటీపడే వీలుంది. ఈ క్రమంలోనే మూడోస్థానం కోసం కంబోడియాకు చెందిన కోమ్మేన్ డైతో క్విమ్సి తలపడనుంది.

టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్ కలిపి ఆడితే టెక్‌బాల్ అవుతుంది. టీటీ టేబుల్‌పై చేతులతో కాకుండా మిగతా శరీరంతో ఫుట్‌బాల్‌లా తలపడటమే టెక్‌బాల్. 2017లో తొలిసారి టెక్‌బాల్ ప్రపంచ చాంపియన్ షిప్ నిర్వహించారు. 2018-19లో భారత్‌లో ప్రవేశించిన ఈఆటకు.. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. భారత్ నుంచి ఈసారి ఆసియా క్రీడల్లో ముగ్గురు బరిలోకి దిగారు. సింగిల్స్‌తో పాటు మిక్స్ డబుల్స్‌లోనూ క్విమ్సి పోటీపడుతోంది. ఈ గేమ్‌లో భారత్‌కు ఆమె పతకం తీసుకువస్తే.. ఈ క్రీడలో పతకం గెలిచిన తొలి అథ్లెట్‌గా చరిత్రలో నిలిచిపోనుంది.



చైతన్య రథం
సినిమా
ఆదివారం 20 సెప్టెంబరు 2026 X




## వచ్చే నెల నుంచి
# 'డ్రాగన్' షూట్‌లోకి ఎన్టీఆర్

సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'డ్రాగన్'పై భారీ అంచనాలున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ప్రశాంత్ నీల్ ఆస్థాన సంగీత దర్శకుడు రవి బస్రూర్ అందించే థియేట్రికల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ప్రత్యేకం. ఈ సినిమాకు సబంధించి ఎన్టీఆర్ అభిమానులకు ఒక గుడ్‌న్యూస్ బయటకి వచ్చింది.

ఇటీవల 'డ్రాగన్' షూటింగ్‌లో ఎన్టీఆర్ చేతికి స్వల్ప గాయమైన విషయం తెలిసిందే. దీంతో వైద్యుల సూచన మేరకు చిన్నపాటి సర్జరీ చేయించుకున్న ఎన్టీఆర్, ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. తారక్ ఇప్పుడు వేగంగా కోలుకుంటున్నారని.. అక్టోబర్ మొదటి వారంలో ఆయన తిరిగి షూటింగ్‌లో జాయిన్ కానున్నట్లు తెలుస్తోంది. ఈలోగా సమయాన్ని వృథా చేయకుండా తారక్ లేని ఇతర ముఖ్య సన్నివేశాలను ప్రశాంత్ నీల్ పూర్తి చేస్తున్నారు. హీరోకు గాయం కావడం వల్ల షూటింగ్ కాస్త ఆలస్యమైనప్పటికీ, విడుదల విషయంలో మాత్రం మేకర్స్ వెనకడుగు వేయడం లేదు. ముందుగా ప్రకటించినట్లే వచ్చే ఏడాది జూన్ నాటికి సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని చూస్తున్నారు. ప్రశాంత్ నీల్ సాధారణంగా తన పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం కేటాయిస్తుంటారు, అందుకే షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి పక్కా షెడ్యూళ్లతో ముందుకెళ్తున్నారు.

ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్, మలయాళ దిగ్గజ నటుడు బిజు మీనన్, సీనియర్ నటి ఖుష్బు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అంతేకాకుండా, సినిమాలో ఒక క్రేజీ 'స్పెషల్ మాస్ సాంగ్' ఉండబోతోందట. అందులో రుక్మిణి వసంత్‌తో పాటు మరో ఇద్దరు భామలతో తారక్ ఊరమాస్ స్టెప్పులు వేయనున్నట్లు సమాచారం. దీనికి తోడు బాలీవుడ్ స్టార్స్ షాహిద్ కపూర్, ఆలియా భట్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం కానున్నారని టాక్ నడుస్తోంది. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# 'అవతార్'ని మించేలా 'రాకా'!




స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై తాజాగా తమిళ దర్శకుడు శిబి చక్రవర్తి చేసిన వ్యాఖ్యలు సినిమా స్థాయిపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. అట్లీ తనకు 'రాకా'కు సంబంధించిన కొన్ని విజువల్స్ చూపించారని శిబి చక్రవర్తి తెలిపారు. భారతీయ సినీరంగానికి గర్వకారణంగా నిలిచే సినిమాను అట్లీ తెరకెక్కిస్తున్నారు. ఆయన నాకు కొన్ని విజువల్స్ చూపించారు. 'అవతార్'లో కూడా అంత గొప్ప విజువల్స్ చూడలేదు. వాటిని వర్ణించడానికి అద్భుతం అనే పదం కూడా సరిపోదు. మరో రెండు, మూడు రోజుల్లో మీరందరూ వాటిని చూస్తారు. దర్శకుడు రాజమౌళి భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకెళ్లినట్టే అట్లీ కూడా 'రాకా'తో ఇండియన్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తారు. అట్లీకి శిష్యుడిగా ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు.

శిబి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల్లో 'రాకా'పై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు చిత్రబృందం కూడా వరుస పోస్టులతో సినిమాపై క్రేజ్ పెంచుతోంది. రెండు రోజుల క్రితం '37' అనే నంబర్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్.. తాజాగా ఓ ఆసక్తికరమైన వీడియోను షేర్ చేశారు. "పరిమితులు దాటి ఆలోచించాం.. లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందడుగు వేశాం.. ఊహించిన దానికంటే ఎంతో ఎత్తుకు వెళ్లాం" అనే అర్థం వచ్చేలా ఆ వీడియోను రూపొందించారు. త్వరలోనే 'రాకా'కు సంబంధించిన కీలకమైన గ్లింప్స్‌ను విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# మాలీవుడ్ నుంచి చాలా నేర్చుకోవచ్చు..




నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో నాని ఇంతకుముందెన్నడూ కనిపించని మాస్ అవతారంలో 'జడల్' అనే పాత్రలో కనిపించనున్నారు. సెప్టెంబర్ 24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడటంతో నాని వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమా విశేషాలను పంచుకుంటున్నారు. తాజాగా కేరళలోని కొచ్చిలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'ది ప్యారడైజ్'కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను నాని వెల్లడించారు. సినిమాకు ఇంకా సెన్సార్ పూర్తికాలేదని, ఏ సర్టిఫికెట్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అలా జరిగితే పిల్లలు, కుటుంబ ప్రేక్షకులు థియేటర్లలో సినిమా చూడలేరన్న విషయం నిజమేనని అన్నారు. నేను ఒకే జానర్ సినిమాలకు పరిమితం కావాలని అనుకోవడం లేదు. నటుడిగా అన్ని రకాల జానర్లను ప్రయత్నించాలనుంది. 'ది ప్యారడైజ్' తర్వాత విభిన్నమైన కథలు, పాత్రలు చేయాలని ఉంది. మరో రెండు సినిమాల తర్వాత 'భలే భలే మగాడివోయ్' తరహాలో ఓ మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేయాలనుకుంటున్నాను. త్వరలోనే అలాంటి సినిమా నా నుంచి వస్తుంది. ఇక 'ది ప్యారడైజ్' ట్రైలర్ ఎందుకు విడుదల చేయలేదనే విషయానికి వస్తే.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అందుకే ట్రైలర్‌ను తీసుకురాలేకపోయాం. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటన్నింటినీ ముందుగానే చూపించడం నాకు ఇష్టం లేదు. ప్రేక్షకులు వాటిని నేరుగా థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి బాగుంటుంది. అందుకే సినిమా గురించి ఎక్కువ విషయాలను బయటపెట్టకుండా ఉంచుతున్నాం. 'హిట్ 3' ప్రచారం కోసం కొచ్చికి వచ్చాను. ఏడాదిన్నర గడిచినా నాకు నిన్ననే ఇక్కడికి వచ్చినట్టుగా అనిపిస్తోంది. ఇక్కడి ప్రేక్షకులు నాకు చూపించే ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేను. మలయాళం సినిమాలంటే నాకు ఎంత ఇష్టమో ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. ఈ మళయాళ చిత్ర పరిశ్రమ–మాలీవుడ్‌ను చూసి చాలా నేర్చుకోవచ్చు. ముఖ్యంగా సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకుంటారు.మంచి సినిమాలను అందిస్తారు. ఇది మిగిలిన పరిశ్రమలన్నీ నేర్చుకోవాలన్నారు.




# 'వారణాసి' వీఎఫ్ఎక్స్ బాధ్యతల్లో నార్వే సంస్థ

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతోన్న మోస్ట్ ప్రెస్టీజియస్ గ్లోబల్ ప్రాజెక్ట్ 'వారణాసి' గురించి మరో అదిరిపోయే అప్‌డేట్ బయటకు వచ్చింది. భారతీయ చలనచిత్ర రంగాన్ని ప్రపంచ సినిమా సరిహద్దులు దాటించేలా ఈ చిత్రాన్ని అద్భుతమైన విజువల్ వండర్‌గా రాజమౌళి తీర్చిదిద్దుతున్న ఈ ప్రాజెక్ట్‌కు.. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌ను అందించడంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నార్వే దేశానికి చెందిన ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ 'గింప్‌విల్లే' పోస్ట్–ప్రొడక్షన్ వీఎఫ్ఎక్స్ బాధ్యతలను చేపట్టినట్లు సమాచారం.

ఈ సినిమా కేవలం భారీ బడ్జెట్‌తో తెరకెక్కే ప్రాజెక్ట్ మాత్రమే కాదు.. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు ఎవరూ చూడని సరికొత్త విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే అద్భుతంగా చెబుతున్నారు. ఈ చిత్రం కోసం అత్యంత అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్ కోసం 400 ఎఫ్‌పీఎస్ (ఫ్రేమ్స్ పర్ సెకండ్) హై–ఎండ్ స్లో–మోషన్ కెమెరాలను వాడుతున్నారు. భారీ కంప్యూటర్ గ్రాఫిక్స్ పరిసరాలు, అంతర్జాతీయ స్థాయి మోషన్–క్యాప్చర్ టెక్నాలజీతోపాటు విదేశీ టాప్–క్లాస్ వీఎఫ్ఎక్స్ స్టూడియోల సహకారంతో దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ జరుపుతూనే సమాంతరంగా పోస్ట్–ప్రొడక్షన్ వీఎఫ్ఎక్స్ పనులను కూడా వేగవంతంగా ముందుకు తీసుకెళుతుండటం ఈ చిత్ర నిర్మాణ శైలిలోని మరో ప్రత్యేకత.

ఈ అంతర్జాతీయ అడ్వెంచర్ డ్రామాలో మహేష్ బాబు 'రుద్ర' అనే అత్యంత శక్తిమంతమైన పాత్రలో కనిపించబోతున్నారు. అనౌన్స్‌మెంట్ వీడియోతోనే ప్రపంచవ్యాప్తంగా అంచనాలు తారస్థాయికి చేరిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ప్రేక్షకుడు ఒక సరికొత్త లోకంలోకి వెళ్లిపోయినట్లు నమ్మేలా ఈ విజువల్ అద్భుతాన్ని రాజమౌళి డిజైన్ చేస్తున్నారు. భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త విప్లవానికి 'వారణాసి' నాంది పలకనునుంది.

## విజయ్ అన్న లేకుంటే
# నేను లేను: అట్లీ

భారతీయ చిత్ర పరిశ్రమలో అపజయం ఎరుగని దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు అట్లీ. 'రాజా రాణి'తో దర్శకుడిగా పరిచయమై, ఆ తర్వాత దళపతి విజయ్‌తో 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' వంటి హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్ అందించిన ఆయన.. షారుఖ్ ఖాన్‌తో 'జవాన్' తీసి ఏకంగా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేశారు. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో భారీ పాన్–ఇండియా చిత్రం 'రాకా'ను తెరకెక్కిస్తున్న అట్లీ.. తాజాగా పాల్గొన్న ఓ వేడుకలో తన కెరీర్, తమిళనాడు సీఎం విజయ్‌తో ఉన్న ప్రత్యేక అనుబంధంపై ఎమోషనల్‌గా స్పందించారు.రొమాంటిక్ సినిమాలు చూడండి

విజయ్ తనకు చేసిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ.. ఈ రోజు నేను వేసుకున్న షర్ట్, ప్యాంట్, చేతికి పెట్టుకున్న వాచ్.. ఇవన్నీ నా కష్టార్జితమే అని నమ్ముతాను. కానీ వీటన్నింటి వెనుక, నా ఈ ఎదుగుదల వెనుక నా దళపతి విజయ్ అన్న ఉన్నారు. ఆయన లేకపోతే నేను ఈ స్థాయికి రావడం అసాధ్యం. 'రాజా రాణి' సినిమాతో నాకు ఇండస్ట్రీలో గుర్తింపు వచ్చింది. దేవుడి దయ, తల్లిదండ్రుల ఆశీస్సులు, నా భార్య సహకారంతో నా ప్రయాణం సాగింది. అయితే, ఆ సమయంలో విజయ్ అన్న నాకు వరుసగా మూడు అవకాశాలు ఇచ్చి నా జీవితాన్నే పూర్తిగా మార్చేశారని అట్లీ చెప్పుకొచ్చారు.

'జవాన్' వెనుక విజయ్ ప్రోత్సాహం

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌తో సినిమా చేసే విషయంలో విజయ్ తనలో నింపిన ధైర్యాన్ని అట్లీ పంచుకున్నారు. షారుఖ్ ఖాన్ సర్ నా ఆఫీస్‌కు వచ్చి నాతో మాట్లాడినప్పుడు.. ఈ విషయాన్ని విజయ్ అన్నతో డిస్కస్ చేశాను. అప్పుడు విజయ్ అన్న నాతో.. రేయ్, నువ్వేం చేస్తావో, ఎలా చేస్తావో నాకు తెలియదు. నా కాళ్ల చుట్టూ తిరగడం ఆపి, ఆ సినిమా మాత్రం దయచేసి చేయి.. నీ జీవితమే మారిపోతుందని చెప్పారు. ఆయన అన్నట్లుగానే ఆ సినిమా నా జీవితాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. విజయ్ అన్నకు నేను జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

తాను ప్రతి వేదికపైనా విజయ్ పేరును ప్రస్తావించడంపై వస్తున్న విమర్శలకు సమాధానమిస్తూ.. నేను పదే పదే విజయ్ అన్న పేరును ప్రస్తావిస్తున్నానంటే, ఆయనతో మరో సినిమా చేయాలనే స్వార్థంతో చేస్తున్నానని కొందరు అనుకోవచ్చు. కానీ ఇకపై ఆయనతో నాకు మరో సినిమా చేసే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆయన ఇప్పుడు రాజకీయాల్లోకి వెళ్లి 'సీఎం విజయ్'గా మారారు. సినిమా ప్రాజెక్టులతో సంబంధం లేకుండా ఆయన ఎప్పటికీ నా అన్ననే అని అట్లీ స్పష్టం చేశారు.

